## సంగారెడ్డి పరిధిలోని హోటళ్లు, రెస్టారెంట్లకు జరిమానా

-ఉమ్మడిజిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ అమృతశ్రీ

**సంగారెడ్డి మున్సిపాలిటీ, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** సంగారెడ్డి నియోజకవర్గ పరిధిలోని జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ముత్తంగి,రుద్రారం,సంగారెడ్డి,కంది గ్రామాలపరిధిలోని హోటళ్లు, రెస్టారెంట్లకు జరిమానాలు విధించినట్లు ఉమ్మడిమెదక్ జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ అమృతశ్రీ తెలిపారు. తనిఖీలలో నిబంధనలు పాటించనివారిపై జిల్లా అదనపు కలెక్టరుకు నివేదిక సమర్పించామని నివేదికను అనుసరించి జిల్లా అదనపుకలెక్టర్ మాధురి శనివారం జరిమానా విధించారని తెలిపారు. కందిపరిధిలోని మైల్‌స్టోన్ రెస్టారెంట్‌కు రూ.50,000, కింగ్స్‌వన్ హోటల్‌కు రూ.25000, ముత్తంగిపరిధిలోని స్వీట్‌హార్ట్ హోటల్‌కు రూ.10000, హరి దోస హోటల్‌కు రూ.25000, రుద్రారంపరిధిలోని ద ప్యాలెస్ హోటల్‌కు రూ.10000, సంగారెడ్డి ఐబి సమీపంలోని బాలాజీ మోహన్‌లాల్ స్వీట్‌హౌస్‌కు రూ.35000 జరిమానా విధించినట్లు తెలిపారు. వంటలలో ఉపయోగించే సరుకులు నాణ్యమైనవి వాడాలని, కల్తనను కల్పవద్దని, ఆరునెలలకోసారి వాటర్ టెస్టింగ్ చేయించుకోవాలని తెలిపారు.




మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త


## ముత్తూట్ మినీ ఫైనాన్స్‌లో ఘరానా మోసం

**నర్సాపూర్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** నర్సాపూర్ పట్టణంలోగల ముత్తూట్ మినీ ఫైనాన్స్‌లో జమ చేసినవారి ఖాతాలను ఆఫైనాన్స్ మేనేజర్ మోసంచేసిన సంఘటన వెలుగులోకి వచ్చింది. ఈసంఘటన వివరాలు ఎస్ఐ కథనం ప్రకారం ఇలా వున్నాయి. నర్సాపూర్ పట్టణంలో ముత్తూట్ మినీఫైనాన్స్ ఆఫీస్‌ను 2024సంవత్సరం 10వనెల 3న ప్రారంభించి ఆఫీస్‌లో ఫైనాన్స్ లావాదేవీలను ప్రారంభించారని తెలిపారు. ఈఫైనాన్స్ షేర్ ఆఫీస్‌లో మేనేజర్‌గా శివ్వంపేటమండలం పెద్దగొట్టిముక్కల గ్రామానికిచెందిన గుండా రాజు పనిచేస్తున్నాడని తెలిపారు. ఈమేరకు పెద్ద గొట్టిముక్కల గ్రామానికి చెందిన పరిచయం ఉన్న గుండె సురేష్, గుండా ఆకాష్, ప్రవీణ్‌లతో కలిసి నకిలీ బంగారం, బంగారు తూకంలో తారుమారు చేసి అక్షరాల 7,10,356 రూపాయలను బ్యాంకు యాజమాన్యానికి మోసం చేసి తప్పించుకున్నడని తెలిపారు. దీంతో రీజినల్ మేనేజర్ ముప్పాల రాజు నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. రీజనల్ మేనేజర్ ముప్పల రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని బాధ్యులపై నలుగురిపై కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్ఐ బి.లింగం తెలిపారు.

## ఎంపిని కలిసిన బిజెపి జిల్లా అధ్యక్షుడు



ఎంపి రఘునందన్‌రావును కలిసి పుష్పగుచ్చాన్ని అందజేస్తున్న బిజెపి జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధామల్లేష్‌గౌడ్ తదితరులు

**నర్సాపూర్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:**
నూతనంగా మెదక్‌జిల్లా బిజెపిపార్టీ అధ్యక్షులుగా ఎన్నికైన వాల్దాస్ రాధామల్లేష్‌గౌడ్ శనివారం హైదరాబాదులోని గోల్కొండ హోటల్లో మెదక్ ఎంపి రఘునందన్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తనపై నమ్మకం ఉంచి మెదక్‌జిల్లా బిజెపిపార్టీ అధ్యక్షులుగా ఎన్నిక చేసినందుకు ఎంపి రఘునందన్‌రావుకు పుష్పగుచ్ఛాన్ని అందించి ప్రత్యేకకృతజ్ఞతలు తెలియజేశారు. ఈసందర్భంగా మెదక్‌జిల్లా బిజెపి అధ్యక్షులుగా ఎన్నికైన వాల్దాస్ రాధామల్లేష్‌గౌడ్‌ను అభినందించిన ఎంపి రఘునందన్‌రావు ఆయనను శాలూవాతో సన్మానించారు. అంతేగాక ఢిల్లీలో బిజెపిపార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించినందుకు సంతోషం వ్యక్తంచేశారు. బిజెపిపార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేసినందులకు ఎంపి రఘునందన్‌రావుతోపాటు బిజెపిపార్టీ అధిష్ఠానానికి, బిజెపిపార్టీ నాయకులకు ఈసందర్భంగా మెదక్‌జిల్లా బిజెపిపార్టీ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధామల్లేష్‌గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. మెదక్‌జిల్లాలో బిజెపిపార్టీని మరింత బలోపేతం చేసేందుకు తమవంతు కృషిచేస్తానని వాల్దాస్ రాధామల్లేష్‌గౌడ్ తెలిపారు.

## కాటేజీల పనులు వేగవంతం చేయాలి

-జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



కాటేజీలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆర్డిఓ మహిపాల్‌రెడ్డి, తహశీల్దార్ శ్రీనివాస్ తదితరులు

**నర్సాపూర్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:**
పర్యాటకుల కోసం నర్సాపూర్ అర్బన్ పార్క్‌లో నిర్మించే కాటేజీల పనులు వేగవంతం చేయాలని జిల్లాకలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. శనివారం నర్సాపూర్ అర్బన్ ఫారెస్ట్ పార్క్ సమీపంలో అటవీశాఖ ఆధ్వర్యంలో పర్యాటకుల కోసం నిర్మిస్తున్న కాటేజీ నిర్మాణ పనులను సంబంధిత నర్సాపూర్ ఆర్డిఓ మహిపాల్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌లతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ మెదక్‌జిల్లాలో పర్యాటక ప్రాంతంగా విరాజిల్లుతూ ప్రకృతి రమణీయతను ఆకళింపు చేసుకుని పర్యాటకుల మదిని ఆకర్షించే చూడచక్కని ప్రదేశాలు ఉన్నాయని తెలిపారు. ఇందులో అర్బన్ ఫారెస్ట్ పార్క్ చూడచక్కని ప్రదేశమన్నారు. పర్యాటకుల తాకిడిని దృష్టిలో పెట్టుకొని కాటేజీలు నిర్మాణం చేపట్టి ఉపయోగంలోకి తీసుకువచ్చినట్లయితే ఆదాయమార్గాలు మెండుగా ఉంటాయని తెలిపారు. మొత్తం 32కాటేజీలు నిర్మాణం చేపట్టగా ప్రస్తుతం 10కాటేజీలు నిర్మాణం పూర్తిచేసుకుని సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. కాగా ఇంకా22 నూతనంగా నిర్మించే రాటేజీలు వివిధదశలలో నిర్మాణంలో ఉన్నాయన్నారు. నిర్దేశితగడువు తేదీలోగా పూర్తిచేసి ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, ఆర్డిఓ మహిపాల్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌లతో ఎంపిడిఓ మధులత, సంబంధిత అటవీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ నామినేషన్‌కు తరలి వెళ్లిన మండల బిజెపి నాయకులు




ఎమ్మెల్సీ అభ్యర్థి నామినేషన్‌కు తరలివెళ్తున్న మండల బిజెపి నాయకులు

**గుమ్మడిదల, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మండల బిజెపి అధ్యక్షుడు కావలి ఐలేష్ ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ పట్టభద్రుల స్థానానికి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి, ఎస్ఆర్ ట్రస్ట్ అధినేత అంజిరెడ్డి మొదటివిడత నామినేషన్‌ను శనివారం కరీంనగర్‌లో వేశారు. ఆయనకు మద్దతుగా గుమ్మడిదల మండల బిజెపి అధ్యక్షుడు కావలి ఐలేష్ ఆధ్వర్యంలో బిజెపినాయకులు తరలివెళ్లారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఢిల్లీ పీఠం బిజెపి ఏవిధంగా గెలిచిందో రాబోయే పట్టభద్రుల ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటుతో అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి గెలుస్తున్నారని ధీమా వ్యక్తంచేశారు. మొదటి ప్రాధాన్యతా ఓటు బిజెపిని గెలిపించాలని కోరారు.

## గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ ప్రజలు కాంగ్రెస్ వెంటే

-కాంగ్రెస్ పార్టీ పట్టణ సేవాదళ్ అధ్యక్షుడు సయ్యద్ బాబా

**గజ్వేల్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:**
గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ ప్రజలు కాంగ్రెస్‌పార్టీ వైపే ఉన్నారని కాంగ్రెస్‌పార్టీ పట్టణ సేవాదళ్ అధ్యక్షుడు, మైనార్టీ సీనియర్‌నాయకుడు సయ్యద్‌బాబా పేర్కొన్నారు. శనివారం గజ్వేల్‌పట్టణంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రానున్న మున్సిపల్ ఎన్నికల్లో 20వార్డులను కాంగ్రెస్‌పార్టీ హస్తగతం చేసుకుంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం పనిచేస్తుందని, ఎన్ని జిమ్మిక్కులు చేసినా బిఆర్ఎస్, బిజెపిలను ప్రజలు నమ్మరని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్ గెలుపు తథ్యమన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురవేసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహుమతిగా ఇస్తామన్నారు.

# పంతంతో పాతాళంలోకి వెళ్ళిన సహకారం..!!

-టేక్మాల్ సొసైటీ రికవరీలో అప్పుడు ఫస్ట్..ఇప్పుడు లాస్ట్
-ప్రాథమిక సహకార సంఘంలో శృతి తప్పిన వైనం
-నష్టాల బాట చవిచూస్తున్న టేక్మాల్ సొసైటీ

**టేక్మాల్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:**
ఉమ్మడిజిల్లాలోని ఉత్తమసొసైటీగా పేరొందిన టేక్మాల్ ప్రాథమిక సహకార సంఘంగా అవార్డు అందుకుంది. మరుగునపడ్డ సొసైటీని అప్పటి ఉప ముఖ్యమంత్రి దామోదర్ రాజనర్సింహ హయాంలో సొసైటీని అభివృద్ధి పర్చాలన్న ఉద్దేశ్యంతో ప్రత్యేకదృష్టిపెట్టి యశ్వంత్‌రెడ్డి నేతృత్వంలో అభివృద్ధికి బీజంపోసి ప్రగతిపథానపరిగెత్తించిన విషయంనఅందరికీ తెలిసిందే. యశ్వంత్‌రెడ్డి మంత్రి దామోదర్‌తో రాజకీయ రంగప్రవేశం చేశారన్నది జగమెరిగిన సత్యం. ప్రభుత్వం మారడంతో చైర్మెన్‌గా కొనసాగుతున్న యశ్వంత్‌రెడ్డి కాంగ్రెస్‌పార్టీనివీడి సొసైటీ అభివృద్ధికోసం పార్టీ మారక తప్పదంటూ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్‌పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో రెండోసారి చైర్మెన్‌గా యశ్వంత్‌రెడ్డికి అవకాశం దక్కింది. కొంతమంది ఆశించినా చైర్మెన్ పదవి దొరకలేదు. 2023 ఎన్నికల్లోనతిరిగి కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో కొందరు నాయకులు పనిగట్టుకొని మరీ పదవీకాంక్షతో అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న సొసైటీపై కన్నేశారు. పచ్చనిసంసారంలో నిప్పులు పోసినట్టు అభివృద్ధిబాటలో కొనసాగుతున్న సహకారసంఘంలో పెత్తనంసాగాలన్న పంతంతో అవిశ్వాస తీర్మానం మొదలుకొని, దాడులు జరుపుకొని దానికి రాజకీయరంగు పూసి నాటకీయ పరిణామాలమధ్య సొసైటీ సిఈఓ సస్పెన్షన్‌తో పంతం పోయిందని అనుకుంటే అదికాస్త హైకోర్టు స్టేతో బెడిసికొట్టిందని అనుకుంటున్నారు. ఇదంతా మంత్రి దామోదర్‌కు తెలియకుండానే జరిగిందని, ఈవిషయం తెలియడంతో ఆకార్యకర్తలపై మండిపడినట్లు తెలిసింది. ఆపంతం కారణంగా సొసైటీలో ఏం జరుగుతుందని పట్టించుకునే దాఖలాలు ఏ నాయకుడికీ, ఏ అధికారికీ పట్టింపులేదని అంటున్నారు. దీంతో గత సంవత్సరాన్ని పోల్చుకుంటే సహకారసంఘం అప్పులరికవరీ పాతాళానికి వెళ్ళింది.




టేక్మాల్ ప్రాథమిక సహకార సంఘం కార్యాలయం

కొత్తరుణాల మాటే లేదు. రికవరీ జాడలేదు అనొచ్చు. పాత సిఈవో సస్పెన్షన్ అయితే కొత్త సిఈవోగా బాధ్యతలు చేపట్టిన ఆయన ఏం చేశారు...? హైకోర్టు స్టేతో ఆగిపోయిన ఈ సిఈవో ఏం చేస్తున్నట్టు...? ఈ సిఈఓ ఉన్నట్లా ఊడినట్లా..? ఈ సొసైటీపై జిల్లాస్థాయి అధికారులుసైతం నోరుమెదపనిస్థాయిలో చేరుకుందంటే దీనికి కారణం ఎవరు..? జిల్లాస్థాయి అధికారులు ఈశాఖకు ఉన్నట్లా, లేనట్లా..? అసలు అవినీతి జరిగిందా, లేదా అని కూడా విచారణ చేయలేక పోయారంటూ రచ్చబండల్లో ముచ్చట్లు పెడుతూ ప్రశ్నించుకోవడం తప్ప ఏమీచేయలేని దయనీయస్థితిలో ఉన్నామంటూ సొసైటీ సభ్యులు సైతం అనుకోవడం గమనార్హం. గత సంవత్సరంలో సొసైటీ ఆధ్వర్యంలో రైతులకు ఇచ్చినరుణాలు రికవరీచేసిన రుణాలు పోల్చుకుంటే అర్థమవుతుందని చెప్పాలి. సహకారసంఘంపై రాజకీయజోక్యంతో లాభాలబాటలోకొనసాగుతున్న సొసైటీ నష్టాల ఊబిలో కూరుకుపోతుందన్న విషయం కాదనలేనినిజం. సుమారు 50 ఏళ్లపైబడి టేక్మాల్ మండలంలో సహకార సంఘం కొనసాగుతోంది. ఆనాటి సొసైటీ అంచలంచెలుగా ఎదిగినప్పటికీ సరైన ఆదరణ లేక నష్టాల ఊబిలో కూరుకుపోయింది. పరిస్థితిని గమనించిన అనాటి పాలకవర్గం అధికారులు మండలంలోగల పల్వంచ సహకార సంఘాలను టేక్మాల్ సహకార సంఘంలో విలీనంచేసినట్లైతే సంఘం లాభాలబాటలోకి వస్తుందని భావించారు. ఆనాడు ఈనెల 15వ తేదితో సొసైటీ కమిటీల పదవీకాలం ముగుస్తుంది. పంతాలను పక్కనపెట్టి అభివృద్ధిపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉందని రైతులంటున్నారు. ఇకనైనా జిల్లాస్థాయి అధికారులు స్పందించి సొసైటీ అభివృద్ధికి ఆటంకాలను తొలగించి ప్రగతిపథాన కొనసాగేవిధంగా చర్యలుతీసుకోవాలని మండల సంఘ సభ్యులు రైతులు కోరుతున్నారు. పైవిషయమై టేక్మాల్ డిసిసిబి బ్యాంక్ మేనేజర్ ప్రత్యుమ్నరెడ్డిని వివరణకోరగా గత ఏడాది రికవరీ 65శాతం ఉందని ఈసారి 21శాతం మాత్రమే అయినట్లు ఆయన చెప్పారు. టేక్మాల్ సొసైటీ సిఈఓ ఎవరు అని అడుగగా నామమాత్రంగా ఇంచార్జ్ సిఇఓగా శివకృష్ణ పెట్టారన్నారు. గొడవల కారణంగా సొసైటీ సిబ్బందికి 3నెలల నుండి వేతనాలు ఇవ్వలేదన్నారు.

## పంచాయతీరాజ్ పనులను మార్చి కల్లా పూర్తి చేయాలి

-కలెక్టర్ మనుచౌదరి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మనుచౌదరి

**సిద్దిపేట, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త ప్రతినిధి:**
పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ పనులను మార్చి చివరకల్లా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో శనివారం పంచాయతీరాజ్, డిఆర్డీఓ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో పంచాయతీరాజ్ శాఖలో ఎన్ఆర్ఈజీఎస్ కింద చేపడుతున్న పనులు సీసీ రోడ్లు, డ్రైనేజీలు, అంగన్‌వాడీ భవనాలు, గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ, పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణం పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో సీసీ రోడ్ పనులు గుర్తించి ఒక వారంలోపు ప్రారంభించి వేగంగా పూర్తి చేయాలన్నారు. పూర్తి చేసిన పనులకు ఎఫ్‌టిఓ జెనరేట్ చేసి ఆన్‌లైన్ అప్లోడ్ చేయాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు ప్రాధాన్యత ప్రకారం అన్ని పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడి జయదేవ్ ఆర్యా, పిఆర్ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, డిఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

# చదువుతోనే సమాజంలో ఉన్నతస్థానం

-జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

**నర్సాపూర్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:**
చదువుతోనే సమాజంలో ఉన్నతస్థానం సాధించవచ్చని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అల్లూరి సీతారామరాజు గిరిజన గురుకుల వసతిగృహంలో శుక్రవారంరాత్రి బస చేసిన కలెక్టర్ రాహుల్‌రాజ్ గురుకుల వసతిగృహంలో ఉదయం అల్పాహారం నాణ్యతనుపరిశీలించి విద్యార్థులతోకలిసి అల్పాహారం తీసుకున్నారు. ఈవసతిగృహంలో మెనూ అమలులో సంతృప్తి వ్యక్తపరిచారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటిస్తూ పాఠశాలలో బోధనవిధానం, సమస్యలు ఏమైనా ఉన్నాయా, పాఠశాలలో ఇంకా కావాల్సిన వసతులు, జీవితంలో ఎలాంటి ఉద్యోగం చేయాలి, ఏం అవ్వాలి అనుకుంటున్నారు, తల్లిదండ్రుల ఆశయం మొదలగు వివరాలను కలెక్టర్ రాహుల్‌రాజ్ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వపాఠశాలల్లో విద్యాప్రమాణాలను మెరుగుపరిచి గుణాత్మకవిద్య అందిస్తున్నామన్నారు. కంప్యూటర్ ప్రయోజనాలు, మారుతున్న టెక్నాలజీ వలన పిల్లలకు మంచి, చెడు గురించి కలెక్టర్ వివరించారు. జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించేదిశగా విద్యార్థులు ఇప్పటినుంచే కృషిచేయాలని అన్నారు. పాఠశాల విద్యార్థులు తాము నిర్దేశించుకున్న గమ్యాలను ప్రతిరోజూ ఉదయం లేవగానే ఒకసారి డైరీలో రాసుకోవాలని అన్నారు. ఈమేరకు లక్ష్యసాధనదిశగా మన ప్రయాణం చేరుకునేందుకు మనల్నిమనం సన్నద్ధంచేసుకోవాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు ఎప్పటికప్పుడు ఆరోగ్యం, ఎదుగుదల పట్ల కూడా శ్రద్ధవహించాలని, పౌష్టికాహారం తీసుకోవాలని, జంక్‌ఫుడ్ తినే అలవాట్లు తగ్గించుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డిఓ మహిపాల్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్,లతో ఎంపిడిఓ మధులత, గిరిజన గురుకుల. వసతిగృహ ప్రిన్సిపల్ శ్రీనివాస్ రాయి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో అల్పాహారంచేస్తున్న జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

## గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌ను కాంగ్రెస్ ఖాతాలో వేస్తాం

-జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి

**గజ్వేల్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:**
గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగురవేసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహుమతిగా ఇస్తామని జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. శనివారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 1,2వార్డుల్లో కాంగ్రెస్‌పార్టీ జెండాపండుగ సందర్భంగా జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీలో కాంగ్రెస్‌పార్టీ పటిష్టంగా ఉందని, ఎవరు పోటీకి వచ్చినా కాంగ్రెస్ గెలుపు ఆగదన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమపథకాలపై ప్రజలను చైతన్యం చేయాలని స్పష్టం చేశారు. అతి త్వరలోనే గజ్వేల్‌లో సిఎం రేవంత్‌రెడ్డి పర్యటన ఉన్నట్లు తెలిపారు. ముఖ్యంగా గత పాలకుల తప్పిదాల ఫలితంగా డబుల్ బెడ్‌రూం ఇళ్లలో అక్రమాలు చోటుచేసుకోగా, సరిచేసి అర్హులకు ఇవ్వాలని కలెక్టర్ దృష్టికి తెచ్చినట్లు తెలిపారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వపథకాలు అందేలా చూడాలన్నారు. అనంతరం 2వవార్డు అధ్యక్షునిగా మల్లారెడ్డిని, రెండవ వార్డుకాంగ్రెస్ అభ్యర్థిగా కప్ప మహేష్‌ను ప్రకటించారు.
ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు ఆంక్షరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, మాజీ కౌన్సిలర్లు షహనా సమీర్, సుభాష్‌చంద్రబోస్, కొండల్‌రెడ్డి, రమేష్‌గౌడ్, గుంటుకు శ్రీనివాస్, ఊడెం శ్రీనివాస్‌రెడ్డి, రాజుగౌడ్, యాదగిరి, పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు కూలీల సహాయం

**అక్కన్నపేట, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:**
మండలంలోని గోవర్ధనగిరిగ్రామంలో ఇటీవల ఉపాధిహామీ కూలీకివెళ్లి మృతిచెందిన ఇద్దరి కుటుంబసభ్యులకు శనివారం కూలీలు అంతాకలసి రూ.5వేల ఆర్థికసహాయాన్ని వారి కుటుంబసభ్యులకు అందజేయాలని ఆ గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటస్వామికి అందజేశారు. కూలీలు అందించిన సహాయాన్ని ఆదివారం రోజున వారి కుటుంబ సభ్యులకు అందజేస్తాని ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటస్వామి తెలిపారు.

## ప్రశాంతంగా ముగిసిన నవోదయ ప్రవేశ ఎంపిక పరీక్ష

**వర్గల్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:**
వర్గల్‌లోని జవహర్ నవోదయ విద్యాలయలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 9,11వ తరగతులలో పరిమిత ఖాళీల భర్తీకై శనివారం నిర్వహించిన ప్రవేశ ఎంపిక పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని విద్యాలయ ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ తెలిపారు. 11వ తరగతి ప్రవేశ పరీక్షకు మొత్తం 1621మంది అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా 1114మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకాగా 507మంది గైర్హాజర్ అయినట్లు తెలిపారు. 9వతరగతి ప్రవేశపరీక్షకు 989మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 563మంది హాజరుకాగా 426మంది గైర్హాజర్ అయినట్లు పేర్కొన్నారు. ప్రవేశ ఎంపికపరీక్షల నిర్వహణకు 10 కేంద్రాలను ఏర్పాటుచేయగా అన్ని పరీక్షాకేంద్రాలను తహసీల్దార్లు భార్గవ్‌రామ్‌నాయక్, భాస్కర్‌లు ఫ్లయింగ్‌స్క్వాడ్ రూపంలో సందర్శించినట్లు తెలిపారు. అలాగే గజ్వేల్‌మండల విద్యాధికారి సునీత పరీక్ష కేంద్రాలను సందర్శించడం జరిగిందన్నారు. ప్రవేశ ఎంపికపరీక్ష నిర్వహణకు సహకరించిన ఉమ్మడిమెదక్ జిల్లా విద్యాధికారులకు, విద్యాశాఖ అధికారులకు, సిబ్బందికి, ఉమ్మడిజిల్లా కలెక్టర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈపరీక్ష విజయవంతంగా పూర్తయ్యేందుకు సహకరించిన నవోదయ విద్యాలయ వైస్‌ప్రిన్సిపాల్ రమేష్ అంచూరి, ఇంచార్జ్ శ్రీనివాస్‌రావు, అధ్యాపక, అధ్యాపకేతరబృందంతో పాటు ఇన్విజిలేటర్లకు ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ కృతజ్ఞతలు తెలిపారు.



పరీక్షాకేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ దాసి రాజేందర్

## గంజాయికేసులో ఆరుగురు నిందితుల రిమాండ్

508 గ్రాముల గంజాయి, మోటార్ సైకిళ్లు, సెల్ ఫోన్ల స్వాధీనం




వివరాలను వెల్లడిస్తున్న రూరల్ సిఐ శ్రీను

**నంగునూర్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:**
గంజాయికేసులో ఆరుగురునిందితులను అరెస్టుచేసి 508గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నటునసిద్ధిపేట రూరల్ సిఐ శ్రీను తెలిపారు. శనివారం ఆయన విలేకరులకు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నంగునూర్ మండలపరిధిలోని అప్పలాయ చెరువుకు చెందిన నాయిని రాజశేఖర్‌రెడ్డి(24), జెపి తాండకుచెందిన గూగులోతు ప్రవీణ్(18), బద్దిపడగ గ్రామానికిచెందిన అలకుంట్ల రాకేష్(20), గూగులోతు రాజకుమార్(25), సిద్ధిపేట మున్సిపల్‌పరిధిలోని రంగధాంపల్లికిచెందిన రొంపల్లి నరేష్(32)లు శుక్రవారం రాంపూర్ ఎక్స్‌రోడ్డు బస్టాండ్ వెనకాల ఖాళీస్థలంలో గంజాయి విక్రయిస్తున్నారని తెలిపారు. నమ్మదగిన సమాచారంమేరకు రాజగోపాల్‌పేట ఎస్ఐ అసిఫ్ దాడిచేసి వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నాయిని రాజశేఖర్‌రెడ్డి, గూగులోతు ప్రవీణ్‌లు గత కొద్దికాలంగా అసిఫాబాద్ జిల్లా కెరిమేరీ మండలంకుచెందిన రవి అలియాస్ జాదవ్ సందీప్ వద్ద కిలోకు రూ.10వేల చొప్పున రూ.20వేలు ఇచ్చి 2కిలోలు తీసుకవచ్చి చిన్న ప్యాకెట్లుగా తయారుచేసి రూ.900 చొప్పున ఒకప్యాకెట్ మిగతా నలుగురికి అమ్ముతున్నట్లు తెలిపారు. నిందితల నుంచి 508గ్రామాల గంజాయి రెండు మోటారుసైకిళ్లు, 5 సెల్‌ఫోన్లు, రూ.3600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు, నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. గ్రామాలలోగానీ పట్టణాలలోగానీ ఎక్కడైనా గంజాయి అమ్మినా, రవాణాచేసినా, నిల్వ ఉంచినా వెంటనే సమాచారం అందించాలన్నారు. సమావేశంలో ఎస్ఐల అసిఫ్, బాలకృష్ణలు పాల్గొన్నారు.

## విద్యార్థులు స్మార్ట్ ఫోన్‌లకు బానిసలు కావద్దు



మాట్లాడుతున్న ఎస్ఐ శంకర్

**పెద్ద శంకరంపేట, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:**
మెదక్‌జిల్లా ఎస్పి ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆదేశాలమేరకు పోలీస్ కళాబృందం పట్టణంలోని సంస్కార్ విద్యాలయంలో మేలుకొలుపు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ శంకర్ మాట్లాడుతూ విద్యార్థులు వారి వ్యక్తిగతవికాసానికి అవసరమయ్యే ఆహారపు అలవాట్లు, సోషల్ మీడియాలోని విషయాల పట్ల, సైబర్ నేరగాల నుండి అప్రమత్తంగా ఉండాలని అన్నారు. స్మార్ట్ ఫోన్‌లను జాగ్రత్తగా వాడాలని, సాధ్యమైనంత వరకు స్మార్ట్ ఫోన్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. పోలీసులు సమాజాన్ని రక్షించడమే కాదు, సమసమాజ మార్గదర్శకులు అని, విద్యార్థులకు మంచిస్నేహితులని వివరించారు. ఈ కార్యక్రమంలో మేలుకొలుపు కళాబృందం కోఆర్డినేటర్ ఏఎస్ఐ సురేందర్, ఎస్‌బి రాములు, కరస్పాండెంట్ సీతారాంరావు దేశ్‌పాండే, విద్యార్థులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ జిల్లా కార్యదర్శిగా మహమ్మద్ షఫీయుద్దీన్ నియామకం

**మనోహరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:**
సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ మెదక్ జిల్లా కార్యదర్శిగా మొహమ్మద్ షఫీయోద్దీన్‌ను నియమించినట్లు రాష్ట్ర సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ డైరెక్టర్ ఎంఎ సలీం తెలిపారు. ఈసందర్భంగా షఫీయుద్దీన్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇచ్చిన పదవికి పూర్తిగా న్యాయం చేస్తానని తెలియజేశారు. అలాగే తన పదవికి కృషి చేసిన మనోహరాబాద్ మండలాధ్యక్షులు మొహమ్మద్ ఆజంకు కృతజ్ఞతలు తెలిపారు. మండలకేంద్రాలలో కార్యవర్గం ఏర్పాటుచేసి సమాచారహక్కుచట్టం-2005పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను చైతన్యవంతులుగా చేస్తానని ప్రమాణం చేశారు.

## ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:**
రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనటంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధి కోర్విపల్లివద్ద శనివారం చోటుచేసుకుంది. కొండాపూర్ గ్రామానికిచెందిన ఇసాకర్ తన స్నేహితునితో కలిసి చిన్నశంకరంపేట నుండి తన స్వగ్రామానికి వెళ్తున్నాడు. అదే సమయంలో ప్యాటగడ్డ తండాకుచెందిన వ్యక్తి వేగంగావచ్చి ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇసాకర్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా వారు వెంటనే గవ్వలపల్లిలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు.

## 11వ తేదీన ఉపాసన సాహితీ సమార్చన



ఉపాసన సాహితీ సమర్చన కార్యక్రమం బ్రోచర్‌ను ఆవిష్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** తెలుగు భాషా సాహిత్యాల అభివృధికి ఉపాసన సంస్థ స్థాపించి తమ వంతు కృషి చేస్తున్న డాక్టర్ మహేశ్వరి- డాక్టర్ సీతాపతి వోలేటి దంపతులు ఈ నెల 11 వ తేదీన మరో సాహితీ కార్యక్రమం చేపట్టారు. గానసభలోని కళాసుబ్బారావు కళా వేదిక పై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంస్థ అధ్యక్షుడు దివాకర్ రావు , కోశాధికారి కల్యాణి లతో కలసి వారు కార్యక్రమ వివరాలు తెలిపారు. చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై గానసభ సౌజన్యంతో జరిగే ఈ కార్యక్రమంలో పద్యకళా తపస్వి డాక్టర్ ధూళిపాళ మహాదేవమణి రచించిన 'బృహత్ శ్రీ ధరీయం పద్య' కావ్యం ఆవిష్కరణతో పాటు ఉపాసన సన్మానించబోతున్నటుల్ల వివరించారు. సంస్కృత పండితుడు బంకుపల్లె రమేష్ శర్మ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సినీ గీత రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు పాల్గొని కావ్యాన్ని ఆవిష్కరిస్తారని, కార్యక్రమంలో సాహితీవేత్తలు శ్రీరామ్‌నాథ్, ఎం సూర్యనారాయణ మూర్తి, ఎం దత్తాత్రేయ శర్మ, వెంకట రమణ శర్మ అవధాని, డాక్టర్ బులుసు అపర్ణ, తాతా సందీప్, గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అతిథులు గా పాల్గొంటారు.

### విశ్వవ్యాప్త తెలుగు వారికి ఆత్మీయుడు రమణాచారి



రమణాచారిని సత్కరిస్తున్న డాక్టర్ కె.ధర్మారావు

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** విశ్వవ్యాప్త తెలుగు వారికి ఆత్మీయులు రమణాచారి అని సమీక్షిత అంతర్జాతీయ తెలుగు సాంస్కృతిక సారస్వత సంఘం (ఇట్క్లా), సంస్కృతికరత్న డాక్టర్ కె.ధర్మారావు అన్నారు. శనివారం ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారికి ఇట్క్లా, హర్ ఆర్ట్ గ్యాలరీ సంయుక్త ఆధ్వర్యంలో అభినందన సత్కారకార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ కళాకారులు మైపాడు రాజా, పౌరాణిక నటుడు మల్లాది పెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

### అభాగ్యులకు అండగా సేమాజసేవకు అంకితమవ్వాలి

**- ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి**



దివ్యాంగులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న రమణాచారి దంపతులు, కొల్లినాగేశ్వరరావు తదితరులు

**నాంపల్లి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** నేటి వ్యవస్థలో దుర్భర జీవితం అనుభవిస్తున్న దివ్యాంగులు, నిరుపేదలు, అభాగ్యులకు అండగా నిలుస్తూ ప్రతిఒక్కరూ సమాజసేవకు అంకితమవ్వాలని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి అన్నారు. వికలాంగుల పిలుపు మాసపత్రిక, అకిలభారత వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో రెడ్‌హిల్స్‌లోని డా. కె.వి.రమణాచారి క్యాంపు కార్యాలయంలో ఆయన 73వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని పలువురు దివ్యాంగులకు నిత్యావసర సరుకులతో కూడిన కెవిఆర్‌కిట్‌లను పంపిణీచేశారు. సమాజంలో ఎంతోమంది అనాథలుగా, అభాగ్యులుగా దివ్యాంగులున్నారని, వారి సంక్షేమం కొరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విశేషంగా కృషిచేయాల్సిన అవసరముందని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వికలాంగుల నాయకులు, రమణాచారికి శుభాకాంక్షలు తెలుపడానికి విచ్చేసిన ఎంతోమంది ప్రముఖులు పాల్గొన్నారు.

## వివేకానంద్‌నగర్ కాలనీ సంక్షేమ కమిటీ కార్యాలయం ప్రారంభం



వివేకానంద్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం కార్యాలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు, కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్.

**యూసుఫ్‌గూడ ఫిబ్రవరి8, ప్రభాతవార్త**

కాలనీలో సంక్షేమ సంఘాలు సమస్యల పరిష్కారం కోసం ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు వారధిగా నిలవాలని ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు అన్నారు. శనివారం అల్లాపూర్ డివిజన్ పరిధిలోని వివేకానంద్‌నగర్ కాలని సంక్షేమ సంఘం కమ్యూనిటీ హాల్‌ను స్థానిక కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్, కాలనీ అధ్యక్షులు బొల్లు శ్రీనివాస్‌రావుతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొల్లు శ్రీనివాసరావును తన సీట్లు కూర్చోబెట్టి అభినందనలు తెలిపారు. కాలనీ సంక్షేమం కోసం తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటూ అభివృద్ధికి పాటు పడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం మైనారిటీ సెల్ అధ్యక్షులు మహమ్మద్ గౌసుద్దీన్, కాలనీ చైర్మన్ తుంగం శ్రీనివాసరావు, రోణంకి జగన్నాథం, సత్యనారాయణ, డివిజన్ కోఆర్డినేటర్ వీరా రెడ్డి, ప్రధాన కార్యదర్శి పిల్లి తిరుపతి పాల్గొన్నారు.

## కమ్యూనిటీ హాల్‌ను కాలనీవాసులకు అప్పగించాలని డిమాండ్

**యూసుఫ్‌గూడ ఫిబ్రవరి 8, ప్రభాతవార్త :**

శ్రీ వివేకానంద్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘానికి చెందిన కమ్యూనిటీ హాల్‌ని కాలనీ వాసులకు అప్పగించాలని విటీమ్ అధ్యక్షులు, కాంటెస్ట్ ప్రెసిడెంట్ దేవిరెంటి మస్తాన్‌రెడ్డి డిమాండ్ చేశారు. కాలనీలోని గతంలో కమ్యూనిటీ హాల్‌గా ఉన్న స్థలంలో వార్డు కార్యాలయంగా నిర్వహిస్తున్నారని అయితే తమ కాలనీలో ప్రజలకు అన్ని విధాల వినియోగించుకునే విధంగా కాలనీకి అప్పజెప్పాలంటూ సంక్షేమ సంఘం అధ్యక్షుడిని కోరారు. అందుకు వారు సానుకూలంగా స్పందించి ఈ విషయమై ప్రజా ప్రతినిధులతో అధికారులతో మాట్లాడి కాలనీకి అందుబాటులోకి తెచ్చేలా చూస్తామన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి బిజెపి నాయకుల పర్యటన



పలు ప్రాంతాలను పరిశీలిస్తున్న బిజెపి శ్రేణులు

**నిజాంపేట్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త**

నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ లోని నిజాంపేట ఇందిరమ్మ కాలనీ ఫేస్ వన్ లో శనివారం ప్రజా సమస్యల పరిష్కారానికి బిజెపి నాయకులు కాలనీలోని వివిధ ప్రాంతాలలో పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నిజాంపేట బిజెపి అధ్యక్షులు బిక్షపతి యాదవ్ మాట్లాడుతూ బీద మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా నివాసముండే ఇందిరమ్మ కాలనీ వంటి ప్రాంతాలలో రోడ్లు, డ్రైనేజీ, సరిపడా నీళ్ల అందక కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. అలాగే డ్రైనేజీ రోడ్ల పైన పారడం, చెత్త వలన దోమల సమస్య విపరీతంగా ఉన్నా ఫాగింగ్ చేయకపోవడం ద్వారా దోమల వలన కాలనీ ప్రజలు అనేక వ్యాధుల బారిన పడుతున్నారని అన్నారు. వివిధ బ్లాక్‌ల వద్ద కరెంటు స్తంభాలు నుండి వెళ్లే వైర్లు వివిధ బ్లాక్‌ల బాల్కనీల వద్ద ఉన్నాయని వీటి వలన గతంలోనే దాదాపు నలుగురు కరెంటు షాక్ తగిలి మరణించిన సంఘటనలు ఉన్నప్పటికీ తగిన చర్యలు చేపట్టడంలో కార్పొరేషన్ పాలకమండలి విఫలమైందని మడ్డిపడ్డారు. ఇందిరమ్మ కాలనీలోని సర్వే నెంబర్ 233లో ఉన్న ప్రభుత్వ భూమిలో ప్రవేట్ సర్వే నెంబర్ పేరుతో అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారని వెంటనే ఆ ప్రభుత్వ భూమిలో సర్వే చేసి కాపాడి దానిలో బడుగు బలహీన వర్గాల ప్రజల పిల్లలు చదువుకోవడానికి అవసరమైన అంగన్వాడీ కేంద్రాన్ని, పార్కును, దేవాలయాల నిర్మించాలని ఇందిరమ్మ కాలనీ ప్రజల తరఫున భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి దాసి నాగరాజు, ప్రధాన కార్యదర్శి సచిన్, లీగల్ సెల్ కన్వీనర్ శేషారావు, బిల్డర్ సెల్ కన్వీనర్ పద్మ ప్రసాద్, సీనియర్ నాయకులు కాసాని నరసింహ, సురేష్, వెంకటేష్ ముదిరాజ్, కౌశిక్ నాయుడు, సంతోష్, కూన ప్రసాద్, యాదయ్య, ఇతర సీనియర్ నాయకులు కార్యకర్తలు ఇందిరమ్మ కాలనీవాసులు పాల్గొన్నారు.

## మార్చి 1 నుంచి 13 వరకు" నైమిషారణ్య పరిక్రమణ "



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీర ధర్మేంద్ర స్వామి, అనిల్ కుమార్ శాస్త్రి గురూజీ, రంజిత్ కుమార్ దీక్షిత్, కృష్ణవేణి శఠకోపన్

**హైదరాబాద్, ఫిబ్రవరి 8,ప్రభాతవార్త:**

ప్రపంచంలో మానవ జీవితం ఉత్కృష్ట మైందని, మోక్ష మార్గానికి నైమిషారణ్య పరిక్రమణ అద్భుతమని నైమిషారణ్యం వేదవ్యాస పీఠాధీశులు అనిల్ కుమార్ శాస్త్రి అన్నారు. నైమిషారణ్య పరిక్రమణ మహోత్సవంలో పాల్గొనేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆహ్వానించేందుకు ఆయన శనివారం హైదరాబాద్ వచ్చారు. ఈ సందర్భంగా సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మార్చి 1వ తేదీ నుంచి 13వ తేదీ వరకు నైమిషారణ్య పరిక్రమణ జరుగుతుందని లక్షలాది భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని మోక్ష పుణ్య ప్రాప్తి పొందాలని పిలుపునిచ్చారు. సత్య యుగంలో ప్రజా శ్రేయస్సు లోక కళ్యాణం కోసం తన శరీరాన్ని దానం చేసిన దధీచి మహర్షి 88 వేల మంది ఋషులకు, 33 కోట్ల మంది దేవతలకు ప్రదక్షిణ చేశారని, అదే సంప్రదాయంగా పుణ్య ప్రాప్తి కోసం 84 కోసుల అతి ప్రాచీన పరిక్రమణ కొనసాగుతున్నదని ఆయన వివరించారు. ఈ పరిక్రమణ కార్యక్రమంలో ఋషులు, సాధువులు, గురువులు కూడా భక్తులతో కలసి పాల్గొంటారని, మనసుతో పాటు సంపద ఆరోగ్యం వృద్ధికి దోహదపడుతుందనేది భక్తుల నమ్మకం అని తెలిపారు. పరిక్రమణ మహోత్సవం ప్రతి రోజు ఉదయం 7 గంటలకు ప్రారంభమై సాయంత్రం 4 గంటలకు ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసే వసతి గుడారాలకు చేరుకుంటారని చెప్పారు. భక్తులకు బోలెరో వాహనాలు ఏర్పాటు చేస్తారు. వసతి భోజన సౌకర్యం తో పాటు సాయంత్రం నుంచి కీర్తనలు, భజనలు, ప్రవచనాలు సాంస్క ృతిక ప్రదర్శనలు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు కన్వీనర్ రంజిత్ కుమార్ దీక్షిత్ తెలిపారు. ఈ సమావేశంలో కర్నాటక మాణికేశ్వరి మాతాజీ శిష్యులు వీర ధర్మేంద్ర స్వామి, వేదవ్యాస పీఠం అధికార ప్రతినిధి కృష్ణవేణి శఠకోపన్ పాల్గొన్నారు

## ఎస్సీవర్గీకరణ సామాజిక న్యాయానికి విరుద్ధం : మాల జెఎసి నేతలు



బిల్లు పత్రాలను దహనం చేస్తున్న జేఏసీ నేతలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 8,ప్రభాతవార్త:**

ఎస్సి వర్గీకరణను అసెంబ్లీలో ఆమోదించి, మూడు గ్రూప్లుగా ప్రకటించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, ఇది సామాజిక న్యాయానికి విరుద్ధమని సమంతా సైనిక్ దళ్ నేత దిగంబర్ కాంబ్లే, మాల సంక్షేమ సంఘం నేతలు బత్తుల రాంప్రసాద్‌లు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో మాల సంఘాల జెఎసి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో అసెంబ్లీలో ఈ నెల 4న కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబించిన విధానాన్ని నిరసిస్తూ వర్గీకరణ బిల్లు పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా దింగబర్ కాంబ్లే రాంప్రసాద్ మాట్లాడారు. కులగణన నివేదిక తప్పుల తడకగా ఉన్నదని, సామాజిక న్యాయాన్ని ఖూనీ చేయడమేనన్నారు. వర్గీకరణ బిల్లు ఆమోదం అనంతరం ఈ నెల 4న సామాజిక న్యాయ దినంగా ప్రకటించుకోవడం సిగ్గుచేటన్నారు. రాజ్యాంగానికి విరుద్ధంగా ఉన్న సుప్రీం ఆదేశాలను సిఎం రేవంత్ పాటించలేదన్నారు. సైంటిఫిక్ ఆధారాలు లేకుండా మాలపై విద్వేషాలు రెచ్చగొట్టడం తప్పా చేసిందేమీలేదన్నారు. సీఎం ఏకపక్ష నిర్ణయం తీసుకోవడం పట్ల మాలల సత్తా చూపిస్తామని, త్వరలోనే సామాజిక విద్రోహం దినం పేరిట బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో జెఎసీ వర్కింగ్ కమిటీ చైర్మన్ రమేష్, చెరుకు రాంచందర్, సీనియర్ దళిత నేత భావన సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడం అభినందనీయం

**-లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ నగేశ్**



కార్యక్రమంలో పాల్గొన్న లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ పి.నగేశ్, పేరి నాగేశ్వరరావు తదితరులు

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:**

విద్యార్థినీ విద్యార్థులకు ఉన్నత విద్యను అభ్యసించడానికి వీలుగా వసతి సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యతను ఇస్తున్నామని లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ పి.నగేశ్ అన్నారు. ఇందులో భాగంగా లయన్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ శతాబ్ది ఈ క్లబ్‌కు నాయకత్వం వహించిన పేరి నాగేశ్వరరావు అభినందనీయులు అని అన్నారు. లైన్స్ క్లబ్ హైదరాబాద్ శతాబ్ది, కొత్తపేటలో ఉన్నటువంటి ప్రభుత్వం ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను రెండింటిని దత్తత తీసుకొని గత ఏడు సంవత్సరాల నుండి కూడా ఇథోధికమైనటువంటి వసతులు కల్పిస్తూ, విద్యార్థులు అందరినీ ఉత్తమ విద్యార్థులుగా తీర్చి దిద్దడంలో చేస్తున్న కృషి ఎంతో గొప్పదన్నారు. శనివారం జరిగిన కార్యక్రమంలో పి.నగేశ్ పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు డాక్టర్ దుర్గాప్రసాద్, పేరి నాగేశ్వరరావు, కందాల శ్రీనివాస్, డాక్టర్ కే సిహెచ్ ఏవిఎస్ మూర్తి, బొగ్గరపు భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

### ఉచితంగా సంగీతం నృత్య శిక్షణ



సంగీత గురువు సంయుక్త లను సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, ఫిబ్రవరి8 ప్రభాతవార్త:** అభిలాష వున్నవారికి ఉచితం గా సంగీతం నృత్య శిక్షణ ఇస్తున్నామని త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్దనమూర్తి అన్నారు. శనివారం రాత్రి త్యాగరాయ గానసభ నిర్వహణలో ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.వి.రమణాచారి జన్మదినోత్సవాల సందర్భంగా ఐదు రోజుల పాటు సంగీత, సాహిత్య కార్యక్రమాల ప్రారంభోత్సవ కార్యక్రమం గానసభలోని కళాసంగీత నాట్యకళావేదికలో శనివారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా కళావిఎస్.జనార్దనమూర్తి మాట్లాడుతూ గానసభ లలిత కళలకు నిత్యం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కార్యక్రమంలో భాగంగా సంగీత గురువు సంయుక్త బృందం ఆధ్వర్యంలో కర్ణాటక సంగీత కార్యక్రమం అద్భుతంగా సాగింది. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ గాయకుడు చింతలపూడి త్రినాథరావు, ప్రముఖ గాయకుడు కె.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల మేధాశక్తికి వైజ్ఞానిక ప్రదర్శనలు





**అత్తాపూర్ ఫిబ్రవరి8,ప్రభాతవార్త :**

విద్యార్థుల్లో సృజనాత్మకత,మేధాశక్తికి ప్రతిరూపమే ఈ వైజ్ఞానిక ప్రదర్శనలని జిల్లా ట్రెస్మా ట్రేజర్ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శివరాంపల్లి షైనీ స్టార్స్ స్కూల్ లో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా ట్రెస్మా ట్రేజర్ శ్రీనివాస్ అతిథిగా హాజరై వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించి 1వ తరగతి నుండి 7వ తరగతి వరకు విద్యార్థిని,విద్యార్థులు తయారు చేసిన వివిధ ప్రదర్శనలను కరస్పాండెంట్ ఫరీదా బేగంతో కలిసి తిలకించి విద్యార్థులను అభినందించారు.అనంతరం ఆవిష్కరణలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... చిన్నారులు ఎంతో అద్భుతంగా ఆవిష్కరణలు రూపొందించారని విద్యార్థుల్లో శాస్త్రీయ నైపుణ్యం పెంపొందించడంతోపాటు సమాజానికి ఉపయోపడే ఎన్నో ప్రదర్శనలు ఏర్పాటు చేశారని విద్యార్థులను భావి సైంటిస్టులుగా మార్చేందుకు ఈ వైజ్ఞానిక ప్రదర్శన ఎంతో ఉపయోపడు తుందని పేర్కొన్నారు. విద్యార్థులను ప్రోత్సహించి చక్కటిఆవిష్కరణలు రూపొందించడంలో సహకరించిన తల్లి దండ్రులు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కా ర్యక్రమంలో స్కూల్ టీచర్స్,విద్యార్థులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## విద్య వైజ్ఞానిక సాంకేతిక రంగాల్లో నైపుణ్యాలను అలవర్చుకోవాలి

**- పెద్దపల్లి లోకసభ సభ్యుడు గడ్డం వంశీ కృష్ణ**



వైజ్ఞానిక సాంకేతిక ప్రదర్శనను తిలకిస్తున్న పెద్దపల్లి లోకసభ సభ్యుడు గడ్డం వంశీ కృష్ణ

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:**

విద్య వైజ్ఞానిక సాంకేతిక రంగాల నైపుణ్యాలను విద్యార్థులు అలవర్చుకుని ముందుకు సాగాలని పెద్దపల్లి లోకసభ సభ్యుడు గడ్డం వంశీ కృష్ణ అన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబబేద్కర్ కళాశాలలో 'అనివాల్ డే సెలెబ్రెటీన్స్' శనివారం ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా గడ్డం వంశీకృష్ణ హాజరై మాజీ కేంద్రమంత్రి గడ్డం వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి గారి ఫోటో కి పువ్వుల మాలతో ప్రభించారు, దీనికి ఉద్దేశించి మాట్లాడుతూ ఎంతో మంది ఈ కళాశాల లో చదువుకొని ఉన్నతమైన స్థానాలకు చేరుకున్నారు, అని మన రాష్ట్రంలో మొదటి స్థానం లో మన పిల్లలని చూడాలని వుంది అని అందరూ మంచి మార్కు లతో పాస్ అయి కళాశాలకు మంచి పేరు తీసుక రావాలని తెలియజేసారు , విద్యార్థి దశలోనే సమాజాన్ని చదువుతూ ఒక స్థిర లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ఆ లక్ష్యసాధనకై నిరం తర శ్రమ పట్టుదల కలిగి ప్రయత్నం చేయడం ద్వారా గొప్ప విజయాలను సాధించవచ్చని తెలిపారు. కళాశాల కార్యదర్శి, ఎమ్మెల్యే గడ్డం వినోద్ విద్యార్థులతో ముఖాముఖి చర్చ కార్యక్రమంలో పాల్గొని తమ తండ్రి గడ్డం వెంకట్ స్వామి దూర దృష్టితో సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విద్యాల యాలను స్థాపించారన్నారు. ఫలితంగా వేలాదిగా విద్యార్థులు చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకున్నారన్నారు. విద్యా సంస్థల చైర్మన్ వివేక్ వెంకటస్వామి, కరస్పాండెంట్ సరోజ వివేక్ ఎలాంటి సహాయ సహకారాలనైన అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. విద్యాసంస్థల డైరెక్టర్ విష్ణు ప్రియ, ప్రిన్సిపాల్ వితలాచారి, వైస్ ప్రిన్సిపల్ రాధా రాణి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఏవో కిరణ్ కుమార్, జూనియర్, డిగ్రీ ,లా, ఎంబీఏ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. అనంతరం సేవ్ ఎన్విరాన్మెంట్ అనే అంశం పై కళారూపాల ప్రదర్శన సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థులు పాల్గొని అందరిని అలరించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే ఏర్పాటు చేయబడిన ఫుడ్ కోర్టులలోని ఆహార పదార్థాలను ,చేతివృత్తుల ద్వారా తయారు చేయబడిన అనేక రకాల వస్తువులను ప్రదర్శించడమే కాకుండా వాటిని విక్రయం ద్వారా విద్యార్థులు వ్యాపార మెలకువలను ఔత్సాహిక పారిశ్రామికవేత్తల లక్షణాలను అలవర్చుకుంటారని సందర్శకులు తెలిపి విద్యార్థులను మెచ్చుకున్నారు . జాతీయ గీతంతో ఈ కార్యక్రమం ముగించారు.

### విద్యార్థులు ఎంచుకున్న రంగాల్లో రాణించేలా ప్రోత్సాహించాలి



గాయిత్రినగర్‌లోని మెఘా స్కూల్‌లో తైక్వాండ్ బెల్ట్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు.

**యూసుఫ్‌గూడ ఫిబ్రవరి 8, ప్రభాతవార్త**

చిన్ననాటి నుంచే విద్యార్థులు చదువుతో పాటు వారు ఎంచుకున్న రంగాల్లో ప్రోత్సహం అందిస్తే భవిష్యత్‌లో రాణించగలుగుతారని మెఘా స్కూల్ చైర్మన్ రఘువీర్‌నాథ్ అన్నారు. శనివారం గాయిత్రినగర్‌లోని మెఘా స్కూల్‌లో తైక్వాండ్ బెల్ట్ పోటీలు నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా ఇంటర్నేషల్ రిఫరీ సంజయ్ ఎగ్జామినగర్‌గా వచ్చారు. పాఠశాలలో విద్యార్థులకు ఎప్పటికప్పుడు పలు అంశాలపై అవగాహన కల్పించటం జరుగుతుందని తైక్వాండ్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో తైక్వాడ్ కోచ్ అష్రఫ్, పాఠశాల ప్రిన్సిపల్ సుచిత్ర పటేల్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రతి డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా : ఎమ్మెల్యే



మహిళలకు కుట్టుమిషిన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం,ఎమ్మెల్సీ వాణీదేవి.

**బేగంపేట ఫిబ్రవరి 8,ప్రభాతవార్త**

కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ప్రతి డివిజన్ ను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు.శనివారం బేగంపేట డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే మాధవరం పలు అభివృద్ధి పనులను పరిశీలించారు.బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరి శ్రీహరి తో కల్సి పలు కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు.ముందుగా శ్యాంలాల్ బిల్డింగ్ ఎరుకల బస్తీలో కమ్యూనిటీ హాలు పనులను పరిశీలించిన అనంతరం పూర్తి అయిన కమ్యూనిటీ హాలును స్థానికులకు అప్పగించారు.అనంతరం ప్రకాశం నగరన రోడ్డు పరిశీలించి పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్డు పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం ఖార్డు సంస్థ వ్యవస్థాపకులు సుమన్ మల్లాది, మంజులత ల ఆధ్వర్యంలో బ్రాహ్మణవాడీ రమానంద మెమోరియల్ సెంటర్‌లో 40మంది మహిళలకు శిక్షణా కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఎమ్మెల్సీ సురభి వాణీదేవితో కల్సి కుట్టు మిషిన్లు అందజేసారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పి.సురేష్ యాదవ్,నరేష్,బీఆర్ఎస్ సీనియర్ నాయకులు టి.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

### కందిమళ్ళ ప్రతాప్‌రెడ్డి గ్రంధాలు ఆవిష్కరణ



గ్రంథాలను ఆవిష్కరిస్తున్న జి.హరగోపాల్, కె.శ్రీనివాస్. చిత్రంలో నిఖిలేశ్వర్, ఎస్వీ సత్యనారాయణ తదితరులు

**సైఫాబాద్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** దేశ స్వాతంత్ర్య ఉద్యమంలోనూ, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో తెలుగునాట తలెత్తిన సకల సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక ఉద్యమాల్లోనూ, నిర్ణయాత్మక పాత్రను నిర్వహించిన మహోద్యమం 'భారత కమ్యూనిస్టు ఉద్యమం' అని పలువురు కమ్యూనిస్టు నాయకులు, ప్రముఖులు కొనియాడారు. ఈ మేరకు శనివారం నారాయణగూడలో స్వాతంత్ర్య సమర యోధుడు, సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు కందిమళ్ళ ప్రతాప్‌రెడ్డి రచించిన రెండు గ్రంథాల ఆవిష్కరణ సభ ప్రముఖ విప్లవ కవి, సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నిఖిలేశ్వర్ అధ్యక్షతన ' భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ళ ఉద్యమ ప్రస్థానం' అనే గ్రంథాన్ని మానవ హక్కుల వేదిక నాయకుడు ప్రొఫెసర్ జి.హరగోపాల్ ఆవిష్కరించారు. అలాగే 'విప్లవాల విప్లవం' అనే గేయ సంపుటిని ప్రముఖ పాత్రికేయులు కె.శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభులు చాడ వెంకట్‌రెడ్డి, పశ్యపద్మ, కార్యదర్శి వర్గ సభ్యులు పల్లా వెంకటరెడ్డి, కవి కందిమళ్ళ ప్రతాప్‌రెడ్డి, కలవేణ శంకర్, ప్రముఖ కవి, విమర్శకులు ఏటుకూరు ప్రసాద్, ఉపాధ్యాయ ఉద్యమ నాకులు నరహరి, మాజీ ఎంఎల్ఎ ఆంజనేయులు, ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

### ఉప్పర్‌పల్లి చౌరస్తాలో బిజెపి విజయోత్సవాలు



**అత్తాపూర్ ఫిబ్రవరి8,ప్రభాతవార్త :** బిజెపి ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో ఘన విజయం సాధించిన సందర్భంగా రాజేంద్రనగర్ డివిజన్ బిజెపి ప్రధాన కార్యదర్శి బండారి బాలకృష్ణ ఆధ్వర్యంలో ఉప్పర్ పల్లి చౌరస్తాలో విజయోత్సవ సంబరాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా యువమోర్చా రాష్ట్ర మాజీ కార్యదర్శి మక్తల్ ఇంచార్జ్ బొక్క బాల్ రెడ్డి హాజరై మాట్లాడుతూ... 26 సంవత్సరాల తర్వాత ఢిల్లీ పీఠాన్ని దక్కించుకున్న బిజెపి కి శుభాకాంక్షలు తెలియజేస్తూ అలాగే ఢిల్లీ ప్రజలు నరేంద్ర మోడీ నాయకత్వం పై నమ్మకంతో క్రేజీవాల్ చేసిన అవినీతి పాలనకు స్వస్తి పలికారని చెప్పారు. ఈ కార్యక్రమంలోరాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు డి సత్యనారాయణ ముదిరాజ్ జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షులు గోనె శ్రీకాంత్ రెడ్డి సీనియర్ నాయకులు ఎస్ విట్టల్ ఓబిసి మోర్చా డివిజన్ అధ్యక్షులు మల్లేష్ చారి ఎస్టీ మోర్చా డివిజన్ అధ్యక్షులు ప్రకాష్ నాయక్ పవన్ స్వప్న రెడ్డి వెంకటేష్ హర్షిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### అత్తాపూర్‌లో బిజెపి నేతలు సంబరాలు



**అత్తాపూర్ ఫిబ్రవరి8,ప్రభాతవార్త :**

27 ఏళ్ల తర్వాత ఢిల్లీ పీఠాన్ని కైవసం చేసుకున్న సందర్భంగా అత్తాపూర్ డివిజన్ అధ్యక్షులు సిలిగే వెంకటేష్ ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి, అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్ ,జిల్లా సెక్రెటరీ కొమురయ్య ,అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్ లు పాల్గొని ప్రసంగించారు . రాబోయే కాలంలో భారతదేశం మొత్తం కాషాయం అవుతుందని అన్నారు. అదేవిధంగా గతంలో తెలంగాణలో కెసిఆర్ కు ఆంధ్రప్రదేశ్లో జగన్ కు పట్టిన గతి ముందు ముందు మన తెలంగాణలో రేవంత్ రెడ్డి కి కూడా ఇదే పరిస్థితి చాలా దగ్గరలో ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కాడెం సుధాకర్ అధికార ప్రతినిధి రాజశేఖర్ జయానంద్ రెడ్డి జిల్లా కౌన్సిల్ మెంబర్ విజయకుమార్ కిరణ్ చారి ఎస్ వాసు పి వెంకట రెడ్డి జగన్ వినోద్ జంగిడ్ అనురాధ సరితా రెడ్డి గాయత్రి విజయ స్వామి సతీష్ శ్రీనివాస్ సాయి యాదవ్ సందీప్ విమల్ శర్మ రాములు రామ్ బాబు తదితరులు పాల్గొన్నారు

## దేశ ప్రజలు మోడీని విశ్వసిస్తున్నారు

**-అసెంబ్లీ కన్వీనర్ పొన్నామోని మల్లేష్ యాదవ్**

**అత్తాపూర్ ఫిబ్రవరి8,ప్రభాతవార్త :** ఢిల్లీ ఓటర్ మహాశయులు విజ్ఞతతో ఓటు వేసే బిజెపి గెలిపించినందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ ఢిల్లీలో బిజెపి ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్న సందర్భంగా రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ పొన్నామోని మల్లేష్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ....దేశ ప్రజలందరికీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పై విశ్వాసం పెరిగిందని బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాలలో అభివృద్ధిని చూసి ప్రజలు రాష్ట్ర అభివృద్ధి చెందాలంటే కేంద్ర ప్రభుత్వంలోని నరేంద్ర మోడీ నాయకత్వంలోని డబల్ ఇంజన్ సర్కార్ అధికారంలోకి వస్తేనే రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయని ప్రజలు విశ్వసిస్తున్నారు. మొన్న జరిగిన ఎన్నికలలో ఆంధ్రప్రదేశ్ ఒరిస్సాల మాదిరిగానే రానున్న రోజులలో గ్రామపంచాయతీ ఎన్నికల్లో మొదలుపెట్టి మున్సిపాలిటీ ఎన్నికలు వచ్చినా గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలు వచ్చినా తెలంగాణ రాష్ట్రంలో కూడా బిజెపి ఇదే తరహాలో విజయం సాధించబోతున్నది రాష్ట్రంలో కూడా బిజెపి ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

### కాటేదాన్‌లో బిజెపి విజయోత్సవ సంబరాలు

**మైలార్‌దేవ్‌పల్లి,ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :**

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి ఘన విజయం సాధించిన సందర్భంగా శనివారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బిజెపి అధ్యక్షులు అడికె జనార్దన్ ఆధ్వర్యంలో కాటేదాన్ బిజెపి కార్యాలయం వద్ద విజయోత్సవ సంబరాలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన నియోజకవర్గం బిజెపి ఇం ఛార్జి, మైలార్ దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో తెలంగాణలో కూడ బిజెపి అధికారంలోకి రావటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

## జల్సాల కోసం చెయిన్ స్నాచింగ్‌కు పాల్పడిన యువకుడి అరెస్టు

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** చెడు వ్యసనాలకు బానిసై జల్సాల కోసం చెయిన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఓ యువకుడిని మీర్‌పేట్ పోలీసులు అదుపులోకి తీసుకొని చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఇన్స్‌పెక్టర్ కీసర నాగరాజు కథనం ప్రకారం పెస్ట్ కంట్రోల్ స్ప్రే పని చేసే బడంగ్‌పేట్ శ్రీనిలయకు చెందిన జల్లి ప్రేమ్‌కుమార్ (28) చెడు అలవాట్లకు బానిసయ్యాడు. అయితే పని చేయడం ద్వారా వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో ఈ నెల 8న మీర్‌పేట్ టిఎస్ఆర్ కాలనీలోని బట్టలు, గార్మెంట్ షాపులోకి హెల్మెట్ ధరించి చొరబడి అందులో ఉన్న ఓ మహిళ మెడలో నుండి బంగారు గొలుసును తెంపుకొని మోటార్ సైకిల్‌పై పారిపోయాడు. ఈ నేపథ్యంలో ఫిర్యాదు అందడంతో పోలీసులు విచారణ జరిపి ప్రేమ్‌కుమార్‌ను నిందితునికి నిర్ధారించి అరెస్టు చేశారు. ఈ మేరకు సుమారు 2 లక్షల విలువ చేసే 20 గ్రాముల బంగారు పుస్తెల తాడు, ఫ్యాషన్ ప్లస్ మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకొన్నారు. నిందితుడిని రిమాండ్‌కు పంపి పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

## హద్నూర్‌లో సిఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణి



హద్నూర్‌లో సిఎంఆర్ఎఫ్ చెక్కును అందచేస్తున్న బిఆర్ఎస్ నేతలు

**న్యాల్‌కల్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** అనారోగ్యానికి గురైన మండల పరిధిలోని హద్నూర్ గ్రామానికి చెందిన పల్లె అశోక్‌కు కార్పోరేట్ ఆసుపత్రిలో మెరుగైన వైద్య అందుకునేందుకు శనివారం సిఎంఆర్ఎఫ్ చెక్కును బిఆర్ఎస్ నాయకులు పంపిణి చేశారు. ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు సహకారంతో అశోక్ మెరుగైన వైద్యం అందుకునేందుకు 13వేల 500 రుపాయల ఎల్ఓసిని మంజూరు చేయించుకుని బాధితుడు పల్లె అశోక్‌కు చెక్కును అందచేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల నాయకులు మాతంశెట్టి రాజ్‌కుమార్, హద్నూర్ సొసైటీ డైరెక్టర్, హద్నూర్ గ్రామ బిఆర్ఎస్ అధ్యక్షులు యంఆర్ ప్రవీణ్‌కుమార్, మంగలి మహేష్, పల్లె రవిలు పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కును అందచేసిన మాజీ ఎమ్మెల్యే



సిఎంఆర్ఎఫ్ చెక్కును అందచేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

**మనూర్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** అనారోగ్యానికి గురై కార్పోరేట్ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందుకునేందుకు మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి శనివారం సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణి చేశారు. మండల పరిధిలోని మాయికోడ్ తాజా మాజీ సర్పంచ్ సుధాకర్‌కు 49వేల 500 రూపాయలు, తోర్నల్ గ్రామానికి చెందిన కొఠారి లాలప్పకు 15వేల 500 రూపాయల ఎల్ఓసిలను మాజీ ఎమ్మెల్యే బాధితులకు అందచేశారు. కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ అధ్యక్షులు విఠల్‌రావు పాటిల్, మాజీ సర్పంచ్‌లు సుధాకర్, శివలింగప్ప, మాజీ ఉప సర్పంచ్ మోసిన్, మాజీ ఎంపిటిసి సభ్యులు రాజు, గ్రామ పార్టీ అధ్యక్షులు చంద్రకాంత్, నాయకులు శివకుమార్, సంగమేష్, మల్లయ్య, దత్తరెడ్డి పాటిల్, గుండ్రెడ్డి, ఇస్మాయిల్ ఖాన్, కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## కుంభమేళాలో కాంగ్రెస్ నేతల పుణ్యస్నానాలు

**నిజాంపేట్ (నారాయణఖేడ్), ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమంలో కొనసాగుతున్న మహాకుంభమేళాలో మండల పరిధిలోని ముసుగేపల్లి గ్రామానికి చెందిన గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జింకల వెంకటేశం, జింకలపాడు న్యాలకంటి కిషన్, గంగాధర్, భూపాల్, సంగమేశ్వర్, కాశిభానుగౌడ్, సంగమేశ్వర్, నారాయణ, నర్సింలు, సాయిలుపాల్గొని పుణ్యస్నానాలు ఆచరించారు. మహా కుంభమేళాలో పాల్గొని పవిత్ర త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించడం తమ పూర్వజన్మ సుకృతమని ఆనందం వ్యక్తం చేశారు.

## కొత్తపల్లిలో పంట పొలాల డిజిటల్ సర్వే

**నిజంపేట్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలోరైతులు సాగు చేస్తున్న పంటలను డిజిటల్ సర్వే చేసి డిజిటల్‌లో యాప్‌లో డౌన్‌లోడ్ చేశారు. యాసంగిలో వరిసాగు పెరిగిందని అధికారులు వివరించారు. వరిపంటకు సోకిన తెగులు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు రైతులకు వివరించారు. కాండం తొలిచే పురుగు ఉధృతంగా ఉన్నట్లు గుర్తించామని, తెగులును నివరిస్తే పంటదిగుబడి అధికంగా వస్తుందని రైతులకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో రైతు పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేడు వీరశైవుల సమావేశం

**నారాయణఖేడ్ టౌన్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** ఈ నెల 9వ తారీఖున పట్టణంలోనిబసవేశ్వర మండపంలో వీరశైవుల సమవేశాన్ని నిర్వ హిస్తున్నట్లు తాలుకా వీరశైవుల సంఘం అధ్యక్షులు ఆనంద్ స్వరూప్ శెట్కార్ తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే సమావేశానికి నియోజక వర్గంలోని ఆయా గ్రామాల్లోని వీరశైవులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆనంద్ స్వరూప్ శెట్కార్ సూచించారు.

## రోగులకు సత్వర వైద్య సేవలు అందించాలి

### పిహెచ్‌సి బాధ్యులకు డిఎంహెచ్‌ఓ శ్రీరాం సూచన



పిహెచ్‌సి బాధ్యులకు సూచనలు చేస్తున్న డిఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీరాం

**పాపన్నపేట, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** అనారోగ్యంతో ఆసుత్రికి చేరిన ప్రజలకు సత్వరమే మెరుగైన వైద్య సేవలు అందించాలని డిఎంఅండ్‌హెచ్‌ఓ శ్రీరాం సూచించారు. శనివారం మండల కేంద్రమైన పాపన్నపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి పరిసరాలను, రికార్డులను శ్రీరాం పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీరాం మాట్లాడుతూ సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు. ఆసుపత్రిలో రోగులకు అందించే మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆసుపత్రి సిబ్బంది అందిస్తున్న సేవల పట్ల డాక్టర్ శ్రీరాం సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి డాక్టర్ హరిప్రసాద్, చందర్, సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## చేర్యాలలో బిజెపి శ్రేణుల సంబరాలు



బాణసంచా కల్చి,సంబరాలు చేసుకుంటున్న బీజేపి శ్రేణులు

**చేర్యాల,ఫిబ్రవరి 8,ప్రభాతవార్త:**26 ఏళ్ళ తరువాత ఢీల్లీలో బిజెపి విజయం సాధించినందుకు శనివారం చేర్యాల పట్టణంలో బీజేపి శ్రేణులు బాణాసంచ కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షులు వడ్లకొండ సంజీవులు మాట్లాడుతూ ఆమ్ ఆద్మీ పార్టీని ఓడించి బీజేపి పార్టీకి ప్రజలు పట్టం కట్టడం చారిత్రాత్మిక తీర్పని ఆయన అన్నారు. నరేంద్రమోడి సుస్థిరమైన పాలనలో ఎలాంటి అవినీతికి చోటులేదన్నారు. అదే విధంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా బీజేపికే పట్టం కట్టాడానికి ప్రజలు సిద్దంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోతుగంటి రామదాసు, నర్ర మహేందర్‌రెడ్డి, ఇర్రి ఉమా సురేష్‌రెడ్డి, తౌట బాలరాజు, సిద్దారెడ్డి, పూర్మ సంజీవరెడ్డి, కాటం సురేందర్, ఆవుశర్ల నర్సింహులు, కొట్టె చంద్రమౌళి, బింగి శ్రీనివాస్, బిట్ల వెంకటేష్ తదితరులు ఉన్నారు.

# వైభవంగా సీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ

## వేలాదిగా తరలివచ్చిన భక్తజన సందోహం

**జోగిపేట,ఫిబ్రవరి 08, (ప్రభాతవార్త):** జోగిపేటలోని శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయం ఆవరణలోనూతనంగా నిర్మించినఆలయంలో సీతా రామ చంద్రస్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మదనానందస్వామి వారి ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రో చ్ఛారణల మధ్య విగ్రహాల ప్రతి ష్ఠాపన కార్యక్రమం శనివారంనాడు కన్నుల పండగగా కొనసాగింది.

ఈ నెల 5వ తేదీ నుంచి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ఆరంభం కాగా, శనివారంనాడు ప్రతిష్ఠాపన కార్యక్రమంతో అన్ని కార్యక్రమాలు ముగిసాయి. పురాతన రాజరాజేశ్వరస్వామి ఆలయానికి ఎదురుగా ధ్వజ స్తంభం ప్రతి ష్ఠాపన, నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో సీతా రామచంద్ర స్వామి, లక్ష్మణుడు, ఎదురుగా ఆంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాన్ని అత్యంతభక్తిశ్రద్ధలతో, వేలాదిమంది భక్తుల మధ్య ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సీతారామచంద్రస్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన సందర్భంగా పట్టణంలోని 12,13 వార్డులలో ప్రతి ఇంట్లో చుట్టాలను, ఆడపడచులను పిలిపించుకోవటంతో ప్రతి ఇంట్లో పండగ వాతావరణం నెలకొంది.



సీతా రామచంద్రస్వామి ఆలయంలో ప్రతిష్ఠించిన స్వాముల వారి విగ్రహాలు

# టేక్మాల్ ప్రాథమిక పశు వైద్యశాలలో పౌల్ట్రీ రైతులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**టేక్మాల్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్తః**
టేక్మాల్ ప్రాథమిక పశు వైద్యశాలలో ఏవియన్ ఇన్ ఫ్లూయెంజ్ వ్యాధి పై మెదక్ పశువైద్యశాల సహాయ సంచాలకులు, మానిటరింగ్ అధికారి డాక్టర్ సట్ల వెంకట్ పశువైద్యులు పౌల్ట్రీ రైతులుకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్‌వెంకట్ మాట్లాడుతూ ఏవిఎన్ ఇన్ఫ్లుఎంజా కోళ్లల్లో సోకక ముందే తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా తెలియజేశారు. ముఖ్యంగా కోళ్ల ఫారం లోపల, బయట ప్రదేశాలలో డిసిన్ఫెక్షన్ ద్రావణంతో స్ప్రే చేయాలి అనుమానిత లక్షణాలు ఉన్న కోళ్లను జబ్బు పడిన కోళ్లను చనిపోయిన కోళ్లను ముట్టుకోకూడదు ఒకవేళ కోళ్ల చనిపోతే గోనెసంచులో వేసి గుంత తవ్వి సున్నం చల్లి పూడ్చిపెట్టాలన్నారు. అలాకాకుండా బయట ప్రదేశంలో వేయకుడదన్నారు.

బయట వాహనాలు లోనికి రాకుండా చూసుకోవలెను మాస్క్, శానిటైజ్ దుస్తులు ధరించాలి తలకు కవర్ పెట్టుకుని బూట్లు వేసుకొని లోపలికి వెళ్ళాలి లోపలికి వెళ్లే ముందు 20 సెకండ్లు డిసిన్ఫెక్షన్ ద్రా వణంలో కాళ్లు కడుక్కోవలెను అని తెలిపారు. కోళ్ల ఫారం రైతులు పెరటి కోళ్ల పెంపకం దారులు కూడా రోగ లక్షణాలు కనిపిస్తే సంబంధిత పశు వైద్య శాలలో తెలియపరచాలన్నారు. పశు వైద్యులు వారు మండల పరిధిలోని గ్రామాలలో తిరిగి కోళ్ల పెంపకం రైతులతో ఈ వ్యాధి పట్ల అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు వెంకట్,టేక్మల్ మండల పశువైద్యులు నాగరాజు, సౌమ్య, అల్లాదుర్గ్ వైద్యులు రాజు, శంకరంపేట వైద్యులు నాగార్జున పాటిల్, నిజాం హుస్సేన్,రేగోడ్ వీరేశం,పాపన్నపేట ప్రవీణ్‌లు పాల్గొన్నారు.

## జూట్ బ్యాగులనే వాడాలి

### -మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య



శానిటేషన్ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య

**గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 8 (ప్రభాతవార్త):**పట్టణ ప్రజలు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి జూట్ బ్యాగులను వాడాలని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో శానిటేషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూసింగిల్‌యూస్ ప్లాస్టిక్‌ను నిషేధించినందున దుకాణ యజ మానులు వాటి విక్రయాలు చేయవద్దన్నారు. ఎవరైనా సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను విక్రయించినా, వినియోగించినా చట్ట ప్రకారం చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. అలాగే ఇంటింటి చెత్త సేకరణ చేసేటప్పుడు ప్రజలకు తడి, పొడి చెత్త వేరుచేసే విధానంపై అవగాహన కల్పించాలని శానిటేషన్ జవాన్లకు, సిబ్బందికి తెలిపారు. ఎండాకాలం వస్తున్నందున ఎక్కడా మొక్కలు ఎండిపోకుండా నీటిని అందించాలన్నారు. ఈ కార్య కమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎ.రవీందర్, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఢిల్లీలో బిజెపి గెలుపు పట్ల హర్షం

### -బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు రాంరెడ్డి

**మర్కుక్, ఫిబ్రవరి 8 (ప్రభాతవార్త):**ఢిల్లీలో భారతీయ జనతా పార్టీ భారీ మెజార్టీతో గెలుపొందడం పట్ల బిజెపి మర్కుక్ మండల పార్టీ అధ్యక్షుడు సాయిరెడ్డి రాంరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శనివారం మండలకేంద్రం మర్కుక్‌లో టపాకాయలు పేల్చి స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడి చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఢిల్లీ ప్రజలు బిజెపికి ఓట్లు వేసి గెలిపించారని స్పష్టం చేశారు. 27 ఏళ్ళ తర్వాత ఢిల్లీ ప్రజలు బిజెపికి పట్టం కట్టడం హర్షణీయమన్నారు. దేశ రక్షణ కోసం ప్రధానమంత్రి నరేంద్రమోడి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. భారతదేశంలో రానున్న రోజుల్లో అన్ని రాష్ట్రాల్లో కమలం వికసిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. లిక్కర్ స్కాంలో ఇరుక్కున్న ఆప్‌ను ఢిల్లీ ప్రజలు తిరస్కరించారని ఎద్దేవ చేశారు. భారతదేశంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా కనుమరుగవడం ఖాయమని అన్నారు. ఢిల్లీలో ఖాతా తెరువని కాంగ్రెస్‌పై దేశ ప్రజలు ఏ విధంగా ఉన్నారో ఢిల్లీ ఎన్నికలే దీనికి నిదర్శనమని తెలిపారు. రానున్న రోజుల్లో తెలుగు రాష్ట్రాల్లో కూడా బిజెపి ప్రభుత్వం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మాజీ మండల అధ్యక్షుడు రమేష్‌గుప్త, నాయకులు ఏగొండ తదితరులు పాల్గొన్నారు

## ఎర్రవల్లి అంటేనే చాయ్ నర్సింలు తాత

**మర్కుక్, ఫిబ్రవరి 8 (ప్రభాతవార్త):**మండల పరిధిలోని మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఎర్రవల్లి గ్రామాన్ని దత్తత తీసుకున్న సందర్భంలో జరిగిన అభివృద్ధి పనుల్లో భాగంగా అధికారుల పర్యటనలు, పోలీస్ బందోబస్తుకు వచ్చిన వారందరూ గ్రామానికి చెందిన పంజాల నర్సింలుగౌడ్ తాత చాయ్ బాగుందని మెచ్చుకునేవారు. ఎక్కడ తాగినా ఇలాంటి రుచికరమైన చాయ్ ఉండదని కితాబిచ్చారు. పిల్లల నుండి పెద్దల వరకు, అధికారుల నుండి ప్రజా ప్రతినిధుల దాకా ఎర్రవల్లికి వస్తే చాలు చాయ్ తాత చాయ్ తాగాల్సిందే. అలాంటి చాయ్ తాత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం తుదిశ్వాస విడిచారు. అయ్యో చాయ్ తాత అంటూ గ్రామస్తులు కంటతడి పెట్టారు. చాయ్ తాత మరణం విషయం తెలుసుకున్న అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు చాయ్ తాత మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

## విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలి

**చిన్నశంకరంపేట,ఫిబ్రవరి 8,ప్రభాతవార్త:** విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని హర్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు మూడె రవి అన్నారు. శనివారం నాడు మండల పరిధిలోని ధర్పలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 36 మంది విద్యార్థిని విద్యార్థులకు విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ స్వప్న సహకారంతో పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస రావు, ఉపాధ్యాయులు రమేష్ చౌదరి, నరేష్ కుమార్, సమద్, రఘుషా, జ్యోతి, రవీందర్, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీ విజయం చారిత్రాత్మకం

**చిన్నశంకరంపేట,ఫిబ్రవరి 8,ప్రభాతవార్త:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతాపార్టీ భారీ విజయం చారిత్రాత్మకమని బిజెపి మండలాధ్యక్షుడు పోగుల రాజు అన్నారు. శనివారం నాడు వెలువడిన ఎన్నికల ఫలితాలలో బిజెపి విజయం సాధించడంతో చిన్నశంకరంపేట పట్టణ చౌరస్తా వద్ద బిజెపి శ్రేణులు స్వీట్లుపంచుకుంటూ, బాణసంచా కాలుస్తూ సంబరాలను జరుపుకున్నారు. అనంతరం మండలాధ్యక్షుడు పోగుల రాజు మాట్లాడుతూ అవినీతి పరులను ప్రజలు ఇంటికి సాగనంపుతారనడానికి ఈ ఎన్నికలే నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు రాచర్ల అశోక్ మరియు సీనియర్ నాయకులు సురేష్ గౌడ్ మరియు జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు మూర్తి శంకర్ మండల జనరల్ సెక్రెటరీ నైనా బోయిన దశరథం, జగ్గరి బాబు మండల ఉపాధ్యక్షుడు మేడి శీను పట్టణ అధ్యక్షుడు ఆకుల రాజు, మండల కార్యదర్శి నవీన్ యాదవ్, ఓబీసీ మూర్చ మండల అధ్యక్షుడు శంకర్, యువ మూర్తి మండల అధ్యక్షుడు తాటికొండ రవి, మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు ఉపాసన మంజుల, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు కర్రల స్వామి బూత్ అధ్యక్షులు రమేష్ మరియు ఎల్లం, మహేష్ బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**చిన్నశంకరంపేట,ఫిబ్రవరి 8,ప్రభాతవార్త:** నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ మోహన్ బాబు, ఏఈ దినకర్‌లు తెలిపారు. చిన్నశంకరంపేట పట్టణంలోని 132 కెవి సబ్ స్టేషన్‌లో వేసవి కాలం ప్రణాళికలో భాగంగా ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం ఏర్పడుతుందని వారు తెలిపారు. మండల పరిధిలోని సూరారం, శాలిపేట, మదూర్ పరిధిలో విద్యుత్ సరఫరాల నిలిచిపోనుందని తెలిపారు. రైతులు, వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

# ఘనంగా రెసోనెన్స్ గురుకుల పాఠశాల వేడుకలు



రెసోనెన్స్ గురుకుల స్కూల్లో వార్షికోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

**పటాన్‌చెరు,ఫిబ్రవరి 8,ప్రభాతవార్త:**రెసోనెన్స్ గురుకుల స్కూల్ పటాన్ చెరువు క్యాంపస్‌లో రెసో దర్పణ్ పేరుతో వార్షిక వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా సంగారెడ్డి డీఈఓ ఎస్ వెంకటేశ్వర్లు, పటాన్ చెరువు ఎంఈఓ నాగేశ్వర్ నాయక్, ప్రత్యేక అతిథులుగా ప్రఖ్యాత రచయిత, దర్శకుడు, నటుడు తనికెళ్ల భరణి, సర్కిల్ ఇన్స్‌పెక్టర్ స్వామి గౌడ్ హాజరయ్యారు. హైదరాబాద్‌లోని పటాన్ చెరువు దగ్గర ఉన్న రెసోనెన్స్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ ఐఐటీ జేఈఈ, నీట్, జేఈఈ (మెయిన్స్+అడ్వాన్స్‌డ్), ఇతర ఇంజనీరింగ్, మెడికల్, కామర్స్, లా ప్రవేశ పరీక్షలలో శిక్షణ ఇచ్చే ఇనిస్టిట్యూట్. ఈ సందర్భంగా రెసోనెన్స్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్, తెలంగాణ ఏపీ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ఈ వేడుక విజయాలను గుర్తించడమే కాకుండా ఉత్సాహంతో జరుపుకునే ఒక ప్రయాణం అన్నారు. అంకితభావం కలిగిన ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. విద్యార్థులకు మార్గనిర్దేశం చేయడంలో, స్ఫూర్తిని నింపడంలో ముందుంటున్నారని తెలిపారు ప్రతి ఒక్కరూ పూర్తి సామర్థ్యాన్ని చేరుకునేలా చేస్తున్నారన్నారు. వాళ్ల అచంచలమైన నిబద్ధత మా విజయానికి మూలస్తంభం అన్నారు. రెసోనెన్స్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ప్రేరణ, సంరక్షణ అనేవి కేవలం సంచలన పదాలు మాత్రమే కాదని, అవి మా విధానంలో అంతర్భాగాలని తెలిపారు. విద్యార్థులను విద్యాపరంగానే కాకుండా వ్యక్తిగతంగా కూడా ఎదగడానికి ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. మీలో ప్రతి ఒక్కరూ మన గొప్ప కథలో ఓ అంతర్భాగం, ఈ ఆనందోత్సవాన్ని ముందుకు తీసుకెళ్దాం, ఉజ్వల భవిష్యత్తును సృష్టిద్దాం. ఈ అద్భుత ప్రయాణంలో మీరు ఓ ముఖ్యమైన భాగమైందందుకు హృదయపూర్వక ధన్యవాదాలుఖీ అని తెలిపారు. రెసో దర్పణ్‌లో విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. ప్రతిభ కనబర్చిన వారికి అవార్డులతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెసోనెన్స్ ఇన్‌స్టిట్యూషన్స్ తెలంగాణ అకడమిక్ డీన్ విద్యాసాగర్, మార్కెటింగ్ మేనేజర్ మార్కండేయులు, జనరల్ మేనేజర్ మల్లేశ్, జోనల్ ఇన్‌ఛార్జ్‌వాణి, ప్రిన్సిపాల్ రామకృష్ణ రెడ్డి, ఉపాధ్యాయులు, 1200 విద్యార్థులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో తన కార్యకలాపాలను విస్తరించింది. దేశంలోని వేలాది మంది ఐఐటీ, నిట్, నీట్ అభ్యర్థులను శిక్షణ ఇచ్చిన రెసోనెన్స్ కోటా.. ఇప్పుడు తన 20 ఏళ్ల విజయవంతమైన ప్రస్థానాన్ని హైదరాబాద్‌కు తీసుకువచ్చింది. హైదరాబాద్‌లో రెసోనెన్స్ డైరెక్టర్ పూర్ణచంద్రరావు ఎన్ నేతృత్వంలో నడుస్తుంది. అత్యుత్తమ కోటా ఫ్యాకల్టీ ఆధ్వర్యంలో ప్రామాణికమైన స్టడీ మెటీరియల్, ప్రత్యేక మెంటార్షిప్ ప్రోగ్రామ్ ద్వారా విద్యార్థులు అత్యుత్తమమైన శిక్షణ పొందేలా చేస్తున్నారు. విద్యార్థులు కేవలం అకడమిక్స్‌లో మాత్రమే కాకుండా, భవిష్యత్‌లో ఎదుర్కొనే సవాళ్లకు సిద్ధంగా ఉండేలా తయారు చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. హైదరాబాద్‌లో మధాపూర్, తార్నాక్, వెస్ట్‌మారేడ్‌పల్లి, దుండిగల్, మేడ్చల్, కుకట్‌పల్లి తదితర ఆరు ప్రాంతాల్లో తొమ్మిది క్యాంపస్‌లు ఉన్నాయి. డే స్కాలర్, హాస్టల్ సౌకర్యాలు కలవు. ఇవి బాలురు, బాలికల కోసం అందుబాటులో ఉన్నాయి. గత ఇరవై ఏళ్లలో 46,000 పైగా రెసోనెన్స్ విద్యార్థులు ఐఐటీలకు ఎంపికయ్యారు. 2,50,000 పైగా విద్యార్థులు నిట్స్ లో లో ప్రవేశం పొందారు. గత 10 ఏళ్లలో 17,000 పైగా విద్యార్థులు వైద్య విద్యా సీట్లను సాధించారు. గత మూడు సంవత్సరాలుగా కోవిడ్ కష్టకాలంలో కూడా జేఈఈ మెయిన్స్ లో రెసోనెన్స్ హైదరాబాద్ 75 శాతం విజయశాతం సాధించింది.

## సమన్వయంతో జాతరను జయప్రదం చేయాలి

### అధికారులకు ఆర్‌డిఓ రమాదేవి సూచన



అధికారులకు సూచనలు చేస్తున్న ఆర్‌డి రమాదేవి

**పాపన్నపేట, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** ఈ నెల 26వ తారీఖు నుంచి జరుగనున్న ఏడుపాయల జాతర జయప్రదంగా ముగిసేందుకు ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనులు చేసుకోవాలని ఆర్‌డిఓ రమాదేవి సూచించారు. శనివారం ఆర్‌డిఓ అధికారులతో కలిసి ఏడుపాయలను సందర్శించి జాతర విజయవంతంగా ముగిసేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఓ రమాదేవి మాట్లాడుతూ జాతరకు చేరుకునే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా అమ్మవారి దర్శనం ప్రశాంతంగా ముగిసేలా చూడాలని ఆదేశించారు. అమ్మవారి దర్శనానికి వెళ్లే భక్తుల కొరకు బారికేడ్లు నిర్మించి వరుస క్రమంలో దర్శనానికి వెళ్లేలా చూసుకోవాలన్నారు. స్నానఘాట్‌ల వద్ద ప్రమాదాలు చోటు చేసుకోకుండా చూసుకోవాలని, గజఈతగాళ్లు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. మరుగుదొడ్లు, మహిళలు బట్టలు మార్చుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు, తాగు నీటి సౌకర్యం కల్పించాలన్నారు. పార్కింగ్ సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలీసులు, ఇరిగేషన్ అధికారులు, ఆర్‌అర్‌బి అధికారులు, పంచాయితీరాజ్‌అధికారులు, ఆరోగ్యశాఖ, ఆర్‌డబ్లుఎస్ అధికారులు సమన్వయంతో పనులు చేసుకుంటూ జాతర జయప్రదంఠ ముగిసేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఓ రామాదేవి అధకారులకు సూచించారు.

## మోడీ వల్లే ఢిల్లీలో బిజెపి విజయం

**జోగిపేట, ఫిబ్రవరి 08, (ప్రభాతవార్త):** ప్రధాని మోదీ విజన్ వల్లే ఢిల్లీ ఎన్నికల్లో బిజెపి ఘనవిజయం సాధించిందని బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు ప్రభాకర్‌గౌడ్, ఓబిసిమోర్చా రాష్ట్రకార్యవర్గసభ్యులు గాజుల అనిల్‌కుమార్‌లు తెలిపారు. మోదీ హయాంలో మన భారతదేశం ఎంతో అభివృద్ధి చెందు తుందని, ప్రపంచదేశాలన్నీ మనవైపే చూస్తున్నాయని వారు పేర్కొన్నారు. ఢిల్లీ ఎన్నికల్లో బిజెపి ఘనవిజయం సాధించిన సందర్భంగా శనివారంనాడు జోగిపేటలో బిజెపి శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. జోగిపేటలోన క్లాక్‌టవర్, వీరహనుమాన్ మందిరాల వద్ద టపాసులు కాల్చి, స్వీట్లు పంచిపెట్టుకున్నారు. రాబోయే కాలంలో తెలంగాణలోనూ బిజెపి అధికారంలోకి వస్తుందని వారు ధీమా వ్యక్తం చేశారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

**ధూళిమిట్ట,ఫిబ్రవరి 8,ప్రభాతవార్త:**మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శనివారం ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు అనుముల కరుణాకర్‌రెడ్డిఅధ్యక్షతన జరుగగా కార్యక్రమంలో భాగంగా విద్యార్థిని, విద్యార్థులు ఉపాధ్యాయులుగా బాధ్యతలు తీసుకుని బోధించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుగా జి. వైష్ణవి, డిఈవోగాఎస్. రాహుల్, డిప్యూటీ డిఈవోగా కె. అమూల్య, యంఈవోగాటి. కార్తిక్, వ్యాయమ ఉపాధ్యాయులుగా టి. రక్షిత, కె. సాత్విక్, టి. అరవింద్, ఆఫీస్ సబార్డినేట్స్‌గా బి. విగ్నేష్, సిహెచ్. యశ్వంత్‌లు వ్యవహరించగాఆయావిద్యార్థి ఉపాధ్యాయులు ఆయా సబ్జెక్టులను విద్యార్థిని, విద్యార్థులకుబోధించారు. అనంతరం ఉపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టిన విద్యార్థిని, విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యా యులు బహుమతులు ప్రధానం చేశారు.

## ముగిసిన అంగన్‌వ్వాడీ ల శిక్షణా కార్యక్రమం



కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వ్వాడీ టీచర్లు

**ధూళిమిట్ట,ఫిబ్రవరి 8,ప్రభాతవార్త:**మండల కేంద్రంలోని రైతు వేదికలో చిన్నారుల అభివృద్ధిపై రిలయన్స్ ఫౌండేషన్, కైఆర్గనైజేషన్‌వారి ఆధ్వర యంలో రెండు రోజుల పాటు అంగన్‌వ్వాడీ టీచర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమము శనివారం నాటికి ముగిసింది. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రేణుక అధ్యక్షతన నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంల బ్లాక్ కో-ఆర్డినేటర్ నవత, సీఆర్పీ నారదాసు ఉమాదేవిలు మాట్లాడుతూ ఫ్రీస్కూల్ పిల్లలకు పాఠ్యాంశాల సారాంశం అర్థమయ్యే విధంగా ఎలా బోధించారో టీచర్లకు వివరించారు. పిల్లల ఎదుగుదలకు తోడ్పడుతూ వారి మేథో వికాసానికి, శరీర అభివృద్ధికి, భాషాభివృద్ధికి కృషి చేయాలని టీచర్లకు సూచించారు. పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల అంగన్‌వ్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలి



విస్తృత సమావేశంలో బీఆర్ఎస్ బీఆర్ఎస్ నాయకులు

**చేర్యాల,ఫిబ్రవరి 8,ప్రభాతవార్త**బీఆర్ఎస్ కార్యకర్తలు మండలంలోని ఆయా గ్రామాల్లో విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం మండలంలోని కాసెగుడెసుల గ్రామంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు షేక్ కమల్ అధ్యక్షతన జరుగగా నాయకులు అంకుగారి శ్రీధర్‌రెడ్డి, పూర్మ వెంకట్‌రెడ్డి, పచ్చిమడ్ల సిద్దిరాములుగౌడ్ పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు.

## అంగన్‌వాడి కేంద్రాన్ని తనిఖీ చేసిన సూపర్‌వైజర్



: అంగన్‌వాడి కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సూపర్‌వైజర్ సుజాత

**కంగ్టి, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడి కేంద్రాలను శనివారం ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుజాత ఆకస్మికంగా తనిఖీ చేశారు. సూపర్‌వైజర్ సుజాత మాట్లాడుతూ విధుల నిర్వాహణ అంకిత భావంతో నిర్వహించాలని, సమయ పాలన పాటించాలని ఆదేశించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అంగన్‌వాడి కేంద్రం తెరిచి ఉండాలన్నారు. గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. 0 నుంచి 5 సంవత్సరాల లోపు చిన్నారులకు బరువు తూకాన్ని రిజిష్టర్‌లో నమోదు చేయాలని, పౌష్టిక ఆహారం, గుడ్లను పరీక్షించి కొనుగోలు చేయాలన్నారు. పాత భవనాల నుంచి అద్దె భవనాల్లోకి మర్చామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు, ఆయలు పాల్గొన్నారు.

## ఘనంగా స్వయం స్వపరిపాలన దినోత్సవం



స్వయంపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

**నంగునూర్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని పాలమాకుల జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో శనివారం స్వయం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులగా వ్యవహరించి తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. డిఈవోగా వి.బన్నీ, పి.భార్గవ్ డిప్యూటీ డిఈవో, కె.అక్షయ హెచ్ఎంగా, చరణ్ పిడిలుగా వ్యవహించారు. ఉషా, లాస్య, రిశ్వంత్, ప్రవల్లిక, రక్షిత, అక్షిత్, అనిల్, జెశ్వంత్, చరణ్, విష్ణు, పవన్, కావేరి, వినయ్, పృథ్వీరాజ్‌లు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో హెచ్ఎం పోతుగంటి ప్రభాకర్‌రావు, ఉపాధ్యాయులు ఎండి మహబూబ్‌అలీ, సంజీవ్, రమణారెడ్డి, పార్థసారథి, హరికృష్ణ, నాగరాజు, రాములు, మురళీధర్‌రెడ్డి, లలితాభవాని, మధు, శేఖర్, అశోక్, రేణుక తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకులకు చెంపపెట్టు ఢిల్లీ ఫలితాలు


సంబరాలు చేసుకుంటున్న బిజెపి నాయకులు

**హుస్నాబాద్‌టౌన్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:**
తెలంగాణ కాంగ్రెస్ నాయకులకు చెంపపెట్టు ఢిల్లీ ఎన్నికల ఫలితాలు అని భారతీయ జనతా పార్టీ హుస్నాబాద్ పట్టణ అధ్యక్షులు దొడ్డి శ్రీనివాస్ అన్నారు. శనివారం దేశరాజధాని ఢిల్లీలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో బిజెపి మెజారిటీస్థానాలు గెలుపొందడంపట్ల హర్షం వ్యక్తంచేస్తూ పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తాలో పార్టీశ్రేణులతో కలసి బాణసంచాలు కాల్చి సంబరాలు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో బిజెపి ఎస్సి మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల శంకర్‌బాబు, అసెంబ్లీ కన్వీనర్ వేణుగోపాల్‌రెడ్డి, బిజెవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కర్ణకంటి నరేష్, కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొల్లపల్లి వీరాచారిలు ఉన్నారు.

## ఢిల్లీ ఎన్నికల్లో బిజెపి గెలుపు పట్ల హర్షం


ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటున్న బిజెపి నాయకులు

**పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:**
ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి గెలుపొందడంపట్ల మండల బిజెపి అధ్యక్షుడు కోణం విఠల్ హర్షం వ్యక్తంచేశారు. బిజెపి భారీమెజార్టీతో అత్యధిక స్థానాలు గెలుచుకోవడంతో శనివారం బిజెపి పార్టీ కార్యాలయం వద్ద బాణాసంచా కాల్చి నాయకులు, కార్యకర్తలు ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకున్నారు. కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శులు బండల శ్రావణ్ కుమార్, మంగలి కృష్ణ. బిజెవైఎం అధ్యక్షులు బొగుడాల కృష్ణ, టెన్కటి మాజీసర్పంచ్ సుధాకర్, రాజుపటేల్, సురేష్, ఆంజనేయులు, వెంకటేశం, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా బిజెపి విజయోత్సవ సంబరాలు


ఢిల్లీలో బిజెపి విజయానికి సంబరాలను జరుపుకుంటున్న బిజెపి శ్రేణులు

**నర్సాపూర్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:**
భారతీయ జనతా పార్టీ దేశ రాజధాని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అఖండ విజయం సాధించడం పట్ల నర్సాపూర్ బిజెపి శ్రేణులు కాషాయ విజయోత్సవ సంబరాలను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నర్సాపూర్ అంబెద్కర్ చౌరస్తాలో బిజెపి శ్రేణులు టపాకాయలు పేల్చి, బాణాసంచాలు కాల్చి అంగరంగ వైభవంగా బిజెపి విజయోత్సవ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు గోడ రాజెందర్, అసెంబ్లీ కన్వీనర్ హన్మంత్ రమణ రావు, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు పాపగారి పెద్ద రమేష్‌గౌడ్, ఓబిసి మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చిన్న రమేష్ గౌడ్, బిజెపిజిల్లా నాయకులు ఆంజనేయులు గౌడ్, బోర్‌వెల్ రామ్‌రెడ్డి, సంఘసాని రాజు, గుండం శంకర్,బాదే బాలరాజు, మేఘరాజ్, పట్టణ అధ్యక్షులు నీరుడి చంద్రయ్య, నాయకులు శ్రీకాంత్, దేవేందర్‌యాదవ్, ఎర్రం ఓంకార్‌గుప్తా, నరేందర్, చిప్ప రాజు, విష్ణునరేందర్, యువ మోర్చా నాయకులు భరత్‌రామ్, నర్సింగ్ రావు, షాపూర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో బిజెపి గెలిచినందుకు సంబరాలు


కుకునూరుపల్లిలో పటాకులు కాలుస్తున్న బిజెపి శ్రేణులు

**కొండపాక, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:**
భారతీయ జనతా పార్టీ భారతదేశ రాజధాని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొ ందడంతో కుకునూరుపల్లి మండలకేంద్రంలో మండలపార్టీ అధ్యక్షుడు అనుముల రేవంత్‌రెడ్డి అధ్వర్యంలో మిఠాయిలు పంచుకొని, పటాసులు కాల్చి ఘనంగా సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు గౌరారం కృష్ణ, దాసరి స్వామి, రెడ్డమైన నాగరాజు, నర్సింలు, రమేష్, చందు కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రామాల్లో మొదలైన స్థానిక సంస్థల ఎన్నికల సందడి

-రిజర్వేషన్ల కేటాయింపులపైనే ఉత్కంఠ
-ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నమైన జిల్లా యంత్రాంగం
-వారంలోగా ఎన్నికల షెడ్యూల్!



గ్రామపంచాయతీ కార్యాలయము (ఫైల్ ఫోటో)

**సంగారెడ్డి మున్సిపాలిటీ, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:**
స్థానికసంస్థల ఎన్నిలకు సంబంధించి నోటిఫికేషన్ త్వరలో వెలువడే అవకాశం ఉన్న నేపథ్యంలో ఇప్పటికే గ్రామాల్లో ఎన్నికలసందడి మొదలైంది. ఎంపిటిసి, జడ్పిటిసి గ్రామపంచాయతీలకు, వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. ఈసారికేటాయించే రిజర్వేషన్‌ల పైనే అందరి దృష్టి ఉంది. ఆశావహులు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. గ్రామాల్లో సామాజిక వర్గాలనుబట్టి రాజకీయపార్టీల నాయకులు రిజర్వేషన్లను ఎవరికివారే అంచనా వేసుకుంటున్నారు. రిజర్వేషన్లు వెలువడిన వెంటనే పోటీ చేసేందుకు ఇప్పటినుంచి సంసిద్ధమవుతున్నారు. ఈక్రమంలో ఇప్పటినుంచే ఆశావహులు గ్రామాల్లో ప్రజలతో మమేకమవుతూ ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. అంతేగాకుండా ప్రస్తుతం ఉన్న పార్టీలోనే కొనసాగాలా... లేదా వేరే పార్టీ లోకి మారాలా అనే ఆలోచనల్లో కొంతమంది ఉన్నట్లు వినిపిస్తుంది. ఇది ఇలా ఉంటే మరికొంత మంది పార్టీలతో సంబంధంలేకుండా ఓటర్లను పలకరిస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో 633 గ్రామ పంచాయతీలు, 276ఎంపిటిసిలకు ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే జిల్లా యంత్రాంగం ఎన్నికల నిర్వహణపై అవసరమైన ఏర్పాట్లు నిమగ్నమై ఉంది. రిజర్వేషన్లు తమకు అనుకూలంగా వస్తాయో, లేదోనని భావిస్తూనే మరోవైపు కీలకనేతలు సర్పంచ్‌లు, ఎంపిటిసిలుగా పోటీచేయడానికి సిద్ధమవుతున్నారు. అధికార కాంగ్రెస్‌పార్టీ నాయకులు జోష్ పెంచుకుంటున్నారు. గతంలో సర్పంచులు, ఎంపిటిసిలు, జెడ్పిటిసిలు, ఎంపిపిలుగా ఎక్కువ మంది బిఆర్ఎస్‌కు చెందినవారే గెలుపొందారు. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలో ఉంది. ఎన్నో సంవత్సరాల నుంచి పార్టీకి పనిచేసినవారు ఈసారైనా స్థానిక ఎన్నికలలో తమకు పదవీయోగం ఉంటుందని ఆశలో ఉన్నారు. సర్పంచ్, ఎంపిటిసి, జెడ్పిటిసి పదవులపై ఆశలు పెంచుకొని వివిధ పార్టీలనాయకులు పార్టీపెద్దల మద్దతు కూడగట్టుకునే ప్రయత్నంలో ఉన్నారు. అధికారంలో ఉన్న పార్టీ మద్దతు ఉంటేనే గెలుపు సాధ్యమవుతుందని ఆపార్టీ నుంచి టికెట్ పొందేందుకు ఆశావహులు ప్రయత్నాలు మొదలుపెడుతున్నారు.స్థానికసంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ అధికారంలో ఉండడం కలిసొస్తుందని కాంగ్రెస్‌లోని ఆశావహులున్నారు. ప్రతిపక్షపార్టీ అయిన బిఆర్ఎస్ పంచాయతీ ఎన్నికలపై దృష్టిపెట్టింది. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు, ఎన్నికలలో కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన గ్యారెంటీలు అమలుచేయకపోవడం వంటి అంశాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తేనే స్థానిక ఎన్నికలలో పట్టుసాధిస్తామని ధీమాలో ఉంది. స్థానిక సంస్థల ఎన్నికలలో వ్యక్తి ముఖ్యమని పార్టీ కాదని మరి కొందరు వాదిస్తున్నారు. ఏపార్టీమద్దతుతో ఎవరెవరికి పోటీ ఉంటుందో గ్రామాల్లో చర్చించుకుంటున్నారు. రిజర్వేషన్లు అనుకూలిస్తే సర్పంచ్ నీకు, ఎంపిటిసి నాకంటూ లెక్కలేసుకుంటున్నారు.

## ఢిల్లీ బిజెపి విజయంతో సిద్ధిపేటలో సంబరాలు


టపాసులు పేల్చి సంబరాలు జరుపుతున్న దృశ్యం

**సిద్ధిపేట అర్బన్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త :**
ఢిల్లీలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి అఖండవిజయం సాధించ డంతో బిజెవైఎం రాష్ట్రనాయకులు తాటికొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆపార్టీ శ్రేణులు శనివారం జిల్లాకేంద్రంలోని పాతబస్టాండు అంబేద్కర్‌సర్కిల్ వద్ద టపాసులు పేల్చి స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. అవినీతి ప్రభుత్వమైన ఆమ్ ఆద్మీని మట్టి కరిపించిన ఢిల్లీ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పిఎం నరేంద్రమోడీ నాయకత్వంలో ఢిల్లీలో 44సీట్లు గెలుచుకొని బిజెపి ఘనవిజయం సాధించిందని తెలిపారు. రాబోయేరోజుల్లో తెలంగాణలో సైతం స్థానికసంస్థల ఎన్నికల్లో బిజెపి సత్తా చాటుతుందన్నారు. కార్యక్రమంలో బిజెవైఎం రాష్ట్రనాయకులు తాటికొండ శ్రీనివాస్, కసనగొట్టు సంతోష్, దాబా నరేష్, బోదాస్ కనకరాజు, బొడ్డు సునీల్, లక్కరాసు కృష్ణ, రాగారం శ్రీనివాస్, కొండూరు మహేష్, గురజాల రవీందర్, సుతారి కార్తీక్, పుర్మా గోపాల్, ప్రసాద్, రాజు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## గీతా పారిశ్రామిక సహకారసంఘం నూతన అధ్యక్షుడి ఎన్నిక

**సిద్ధిపేట అర్బన్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:**
సిద్ధిపేట గీతా పారిశ్రామిక సహకారసంఘం ఎన్నికల్లో గెలుపొందిన డైరెక్టర్లు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పల్లె లాల్‌బహదూర్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా మార్క శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శిగా పల్లె బాల కృష్ణగౌడ్, కోశాధికారిగా గాదాగోని కిష్టయ్యగౌడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డైరెక్టర్లు గాదాగోని సత్యంగౌడ్, పల్లె సునీల్‌గౌడ్, గాదాగోని ప్రకాష్ గౌడ్, పల్లె జ్యోతిగౌడ్, బాలగోని బుచ్చవ్వలు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## మున్నూరుకాపులను తక్కువచేసి మాట్లాడడం అన్యాయం

-మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు దేవయ్య

**సిద్ధిపేట, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త ప్రతినిధి:**
కులగణనలో మున్నూరుకాపులను రాష్ట్రముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్కువ చేసి మాట్లాడడం అన్యాయం అని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు డొంక దేవయ్య అన్నారు. శనివారం సిద్ధిపేట ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కులగణనలో రాష్ట్ర ప్రభుత్వం మున్నూరు కాపులకు మోసం చేసిందని, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ మరోసారి సర్వే నిర్వహించి పక్కా లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమసంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు హరిశంకర్, పూర్ణ, చంద్రశేఖర్, సతీష్, కుమార్, శ్రీనివాస్, మురళి, బాలయ్యతోపాటు తదితరులు ఉన్నారు.

## సేవాగుణం చాలా గొప్పది

**కొండపాక, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:**
ప్రభుత్వ పాఠశాలల్లో ప్రజల భాగస్వామ్యం ఉంటేనే మరింత పటిష్టంగా తయారవుతాయని హెచ్ఎం సముద్రాల శ్రీనివాస్ అన్నారు. కొండపాక గ్రామానికిచెందిన ఐటిఉద్యోగి మంచాల శ్రీనివాస్ తనతండ్రి బాలయ్య జ్ఞాపకార్థం కొండపాక ప్రాథమికపాఠశాలలో 80మందివిద్యార్థులకు తన సొంత ఖర్చులతో స్పోర్ట్స్‌డ్రెస్‌లను అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం గుడిమల్ల శ్రీనివాస్‌గౌడ్, ఎపిపిసి చైర్మన్ నవ్యశ్రీ, ఉపాధ్యాయులు పరమేశ్వర్‌రెడ్డి, యాదగిరి, అనిత, స్వామి, భార్గవి, లక్ష్మి పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డికే టియుటిఎఫ్ మద్దతు

**సిద్ధిపేట రూరల్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:**
కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ ఉపాధ్యాయ నియోజకవర్గ నుంచి మరోసారి ఎమ్మెల్సీగా పోటీచేస్తున్న ప్రస్తుత ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డికి టియుటిఎఫ్ సంపూర్ణమద్దతు ప్రకటిస్తుందని అధ్యక్షులు తుమ్మ లచ్చీరాం, ప్రధానకార్యదర్శి రఘునందన్‌రెడ్డిలు శనివారం తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూర రఘోత్తంరెడ్డికి తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అండగా నిలుస్తుందని తెలిపారు.

## జల ప్రదాతలకు పాలాభిషేకం


కెసిఆర్, హరీష్‌రావుల చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

**చిన్నకోడూరు, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని రామునిపట్లలో శనివారం జల ప్రదాతలు మాజీసిఎం కెసిఆర్, మాజీమంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు చిత్రపటాలకు గ్రామరైతులు, పార్టీశ్రేణులు పాలాభిషేకం చేశారు. గ్రామంలోని కాల్వలకు నీరు విడుదలచేయడంతో రైతులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. హరీష్‌రావు ప్రత్యేకచొరవతో యాసంగిపంటకు సాగునీరు అందుతుందని తెలిపారు.

## డంపింగ్ యార్డు పనులను తక్షణమే నిలిపివేయాలి


డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా ధర్నాలో పాల్గొన్న సిపిఎం నాయకులు

**గుమ్మడిదల, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:**
నల్లవల్లి డంపింగ్ యార్డ్‌కి వ్యతిరేకంగా నాలుగవరోజు పోరాడుతున్న గ్రామ ప్రజలకు సంఘీభావం తెలిపి మీతో మేమంటామని మాట ఇచ్చి సిపిఎం జిల్లా కార్యదర్శి జి.జయరాజు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.రాజయ్య, ఎ.మానిక్,ఎం.నర్సింహులు, జిల్లాకమిటీసభ్యులు బి.నాగేశ్వరరావు, పటాన్‌చెరు సీనియర్ సిపిఎం నాయకులు వాజిద్‌అలీలు ధర్నాలో పాల్గొని సంఘీభావం తెలిపారు. నల్లవల్లి గ్రామంలో డంపింగ్ యార్డు ఏర్పాటును వ్యతిరేకిస్తూ ప్రజలకుమద్దతుగా వారు మాట్లాడుతూ గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామ పంచాయితీ ప్యారానగర్‌లో ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయని, గ్రామస్థులు, మండల ప్రజలు చేపట్టిన నిరసనలు శనివారానికి నాలుగోరోజుకు చేరుకున్నాయన్నారు. రోడ్డుపై బైఠాయించి ధర్నా చేసినట్లు తెలిపారు. తక్షణమే డంపింగ్ యార్డ్ పనులు నిలిపేయాలని, డంపింగ్‌యార్డ్‌ను శాశ్వతంగా రద్దుచేయాలని డిమాండ్‌చేశారు. డంప్ యార్డును రద్దు చేసే వరకు ప్రజల పక్షాన ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నల్లవల్లిగ్రామ మహిళలు, యువకులు, విద్యార్థులు కలిసికట్టుగా రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు భారీగా పాల్గొన్నారు.

# సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యం

-30 యేండ్ల మాదిగల కలను నెరవేర్చిన సిఎం
-మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు మీసం మహేందర్‌యాదవ్


సిఎం రేవంత్‌రెడ్డి, మంద కృష్ణమాదిగలకు పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

**చిన్నకోడూరు, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:**
ఇచ్చిన మాటకు కట్టుబడి నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల 60 యేండ్ల అకాంక్షను సోనియాగాంధీ నెరవేర్చగా 30 యేండ్ల మాదిగల సుదీర్ఘ పోరాటానికి సిఎం రేవంత్‌రెడ్డి ఎబిసిడి వర్గీకరణ అమలు చేసి చరిత్రలో నిలిచిపోయారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మీసం మహేందర్ యాదవ్ అన్నారు. శనివారం చిన్నకోడూరు మండల కేంద్రంలో అంబేద్కర్ సర్కిల్ వద్ద మీసం మహేందర్ ఆధ్వర్యంలో సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు కొండా సురేఖ్, దామోదర రాజనరసింహ, పొన్నం ప్రభాకర్‌గౌడ్, పార్టీ నాయకులు జగ్గారెడ్డి, పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగ చిత్ర పటాలాకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీలో బిసి కులగణన, ఎస్సీఎబిసిడి వర్గీకరణ చేసి సిఎం రేవంత్‌రెడ్డి ప్రజల గుండెల్లో నిలిచిపోయారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అన్ని వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలన్నారు. మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో 30 యేండ్ల సుదీర్ఘ పోరాట ఫలితంగానే వర్గీకరణ జరిగిందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజ్‌వీర్, సందబోయిన పర్శరాములు, కొరిమి రాజు, పొన్నల రాజేష్, కొమ్ము ప్రశాంత్. పాకాల భూపతిరెడ్డి, వెంకటరెడ్డి, కొలను గణేష్, గుడుమల్ల మల్లేశం, పట్నం కనకయ్య, ఎమ్మార్పిఎస్ నాయకులు కొమ్ము రాజు, శ్రీనివాస్, రాజు, చందు, లక్కరాజు పాల్గొన్నారు.

## వేల్పుగొండలో శ్రీతుంబురేశ్వరస్వామి ఉత్సవాలు

**టేక్మాల్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:**
టేక్మాల్ మండలపరిధిలోని వేల్పుగొండ శ్రీతుంబురేశ్వరస్వామి ఉత్సవాలు ఈనెల 9వ తేదినుండి 12వ తేదీవరకు స్వామివారి నిర్వహించడం జరుగుతుందని ఆలయపూజారి రవికోటివైద్య రామశర్మ తెలిపారు. ఉత్సవాలను శ్రీమదనానందస్వామి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈనెల 9వ తేదీన మాఘ శుద్ధ ద్వాదశి ఆదివారం రుద్రాభిషేకం, పుణ్యాహవచనము కలశస్థాపన శకట ఉత్సవం సాయంత్రం బండ్లు బోనాలు నిర్వహిస్తారు.10 తేదీన సోమవారం రుద్రాభిషేకము పుష్పార్చన శకటోత్సవం పాచీ బండ్లు నిర్వహిస్తారు. 11వ తేదీన బిల్వార్చన రుద్రాభిషేకం పల్లకిసేవ నిర్వహించడం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం రెండుగంటలనుండి కుస్తీ పోటీలు నిర్వహించడం జరుగుతుంది రాత్రి పార్వతీపరమేశ్వర రథోత్సవం జరుగుతుంది 12వ తేదీన మాఘశుద్ధ పౌర్ణమిన పార్వతి పరమేశ్వరులకు కల్యాణోత్సవం అంగరంగవైభవంగా జరుగుతుంది. కార్యక్రమాలకు శ్రీమాధవానందసరస్వతిస్వామి, రంగంపేట పీఠాధిపతులు, శ్రీరాజయోగి వెంకటస్వామి ఆత్మానంద ఆశ్రమం రుస్తుంపేట పీఠాధిపతులు కార్యక్రమానికి హాజరవుతారని ఆలయపూజారి రవికోటి వైద్య రామశర్మ తెలియజేశారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల ప్రచారం

**హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:**
పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల అడ్మిషన్లను పెంచేందుకు కళాశాల అధ్యాపకబృందం శనివారం మండలంలోని కొన్ని గ్రామాలతోపాటు పట్టణంలోని ప్రభుత్వ కళాశాలలు,మోడల్‌స్కూల్‌లలో విద్యార్థులకు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ విజయగిరి బిక్షపతి మాట్లాడుతూ ప్రభుత్వకళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు, అధునాతన కంప్యూటర్ ల్యాబ్, హైనోహబ్ ద్వారా నైపుణ్య శిక్షణా తరగతులు జరుగుతాయని విద్యార్థులు తమ కళాశాలలో చేరి తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలన్నారు. కళాశాలలో అడ్మిషన్‌పొందే బాలికలకు హాస్టల్ వసతి కూడా ఉన్నట్లు వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకబృందం డాక్టర్ బాలరాజు, నైనాదేవి, జయ, సుధ, మాధురి, శ్రీనివాస్‌తోపాటు తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వాసుపత్రిలో 4.3కిలోలతో జన్మించిన బాలుడు

**హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:**
హుస్నాబాద్ పట్టణంలోని సామాజిక ఆరోగ్యకేంద్రంలో శనివారం పురిటినొప్పులతో వచ్చిన ఒకమహిళకు 4కిలోల3వందలగ్రాముల బరువుతో మగబిడ్డ జన్మించినట్లు ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ రమేష్‌రెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హుస్నాబాద్ పట్టణ కేంద్రానికిచెందిన ముంతాజ్ అనే గర్భిణి పురిటినొప్పులు రావడంతో హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి రాగా తమవైద్యులు శనివారం డెలివరీ చేయగా 4కిలోల 300ల గ్రాముల శిశువుకు జన్మనివ్వగా తల్లీబిడ్డల ఆరోగ్యపరిస్థితి నిలకడగా ఉందన్నారు. గర్భిణీస్త్రీలతోపాటు వివిధ అనారోగ్య కారణాలతో బాధపడుతున్న రోగులు ప్రయివేట్ ఆసుపత్రులకు వెళ్లి ఆర్థికంగా నష్టపోకుండా ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందాలన్నారు. ప్రభుత్వాసుపత్రిలో అనుభవజ్ఞులైన వైద్యబృందం ఉందని సూచించారు. అయితే ప్రసవించిన ముంతాజ్‌కు ఇది నాలుగవ సంతానం కావడంతో వారి భర్త అనుమతితో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ సైతం చేసినట్లు ఆయన వివరించారు.

## ఘనంగా వేరిటాస్ సైనిక్ పాఠశాల వార్షికోత్సవం

-ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు


విద్యార్థులకు అవార్డులు అందజేస్తున్న బ్రిగేడియర్ ప్రశాంత్ హల్గేరి

**ములుగు, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:**
ములుగుమండలం వంటిమామిడిలో ఉన్న వేరిటాస్ సైనిక్ పాఠశాల ప్రథమవార్షికోత్సవ వేడుకలను శనివారం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ, ఆంధ్ర సబ్ ఏరియా ఎడ్యుకేషన్ డైరెక్టర్ బ్రిగేడియర్ ప్రశాంత్ హల్గేరి విద్యార్థులను ప్రేరేపించేలా ప్రసంగించారు. పాఠశాల చైర్మన్, మాజీ ఆర్మీ ఆఫీసర్ డాక్టర్ బి.శేషరెడ్డి నేతృ త్వంలో జరిగిన ఈకార్యక్రమంలో రిటైర్డ్ నేవీ కమాండర్, డీన్ వినోద్ బంగా, వైస్‌ప్రిన్సిపాల్ మనసాచౌదరి, పలువురుప్రముఖులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బిజెపి వెంటే మేమంతా అంటున్న ఢిల్లీ


గజ్వేల్‌లో సంబరాలు చేసుకుంటున్న బిజెపి నాయకులు

**గజ్వేల్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:**
చీపురును ఛీకొట్టారు, చేతిని చిదిమేశారు, కమలాన్ని వికసింపజేశారని బిజెపి సీనియర్ నాయకులు ధరం గురువారెడ్డి, మాదాడి జశ్వంత్‌రెడ్డి, గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్, మండల అధ్యక్షుడు అశోక్ గౌడ్‌లు పేర్కొన్నారు. శనివారం ఢిల్లీలో బిజెపి గెలుపుపట్ల గజ్వేల్ అంబేద్కర్ చౌరస్తా వద్ద టపాకాయలు కాల్చి మిఠాయిలు తినిపించుకుంటూ నాయకులు సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు యెల్లు రాంరెడ్డి, పిడిచెడ్ వెంకట్‌రెడ్డి, కుడిక్యాల రాములు, ఉప్పల మధుసూదన్, సిల్వేరి జనార్థన్, చెప్యాల వెంకట్‌రెడ్డి, నాగు ముదిరాజ్, నాయిని సందీప్‌కుమార్, భాస్కర్‌రెడ్డి, పెండ్యాల శ్రీనివాస్, బార్ అరవింద్, అయిల మహేందర్, కొన్నె రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, నీరజ, మమత, స్వరాజ్యలక్ష్మి, దూబకుంట భక్తమాల పాల్గొన్నారు.

## వికసిత్ భారత్‌కు జైకొట్టిన ఢిల్లీ ప్రజలు


మాట్లాడుతున్న బిజెపి జిల్లా మాజీ అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్

**సంగారెడ్డి బ్యూరో, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త:**
ఢిల్లీ అయినా గల్లీ అయినా బిజెపితోనే మనసంతా, నరేంద్రమోడీతోనే మేమంతా అనిచాటిన ఢిల్లీప్రజలకు కృతజ్ఞతలు అని బిజెపి మెదక్ జిల్లా మాజీ అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ అన్నారు. శనివారం ఢిల్లీ ఎన్నికల ఫలితాల్లో బిజెపి అత్యధికస్థానాలలో గెలిచిన సందర్భంగా బిజెపిశ్రేణులు స్థానికప్రజలకు మిఠాయిలుపంచుతూ, బాణాసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నాయినిప్రసాద్, జిల్లా జనరల్ సెక్రెటరీ ఎంఎల్ఎన్‌రెడ్డి, ఓబిసి జిల్లాఅధ్యక్షులు గడ్డం కాశీనాథ్, లోకేష్, నల్లాల విజయ్, ఆకుల రాము, విఠలేష్, ఆంజనేయులు, సత్యం, బక్కవారి శివ, కిరణ్, బంటి, భానుప్రసాద్, పెద్ద ఎత్తున బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.